ఈనాటి
# తెలుగోడు
PRGI-NO-APTEL/25/A2739
EENAATI TELUGODU... Telugu Daily
https://www.eenaatitelugodu.com
సంపుటి-1 | సంచిక - 169 | గురువారం 19 మార్చి 2026 | పేజీలు - 8 | వెల - రూ.. 5
Published From - Vijayawada, Anantapur, Sri Satyasai, Kurnool, Nandyala, Kadapa, Annamayya, Srikakulam, Nellore, chittoor, Tirupati




## అట్టహాసంగా ప్రారంభమైన
# దివ్యాంగ శక్తి




- 12.75 లక్షల మందికి ఉచిత ప్రయాణ సౌకర్యం..
- ఐదు రకాల బస్సుల్లో ఖర్చు లేకుండా ప్రయాణం..
- నెలకు రూ.2 వేల వరకు ఆదా అయ్యే అవకాశం..
- మహిళల స్త్రీ శక్తి పథకంతో ఇప్పటికే 52 కోట్ల ప్రయాణాలు..
- దివ్యాంగులను ఆప్యాయంగా పలకరించి సహపంక్తి భోజనం చేసిన సిఎం చంద్రబాబు..

**అమరావతి(తెలుగోడు), మార్చి 18 :**
దివ్యాంగుల ప్రయాణానికి ఊరట కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన దివ్యాంగ శక్తి పథకాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, డిప్యూటి సిఎం పవన్‌కళ్యాన్, మంత్రి నారా లోకేష్‌లు అట్టహాసంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు దివ్యాంగ శక్తి పథకంపై లబ్దిదారులతో ఆత్మీయంగా మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం కేవలం 21 నెలల్లోనే ఎన్నో కీలక కార్యక్రమాలు అమలు చేసినట్లు ముఖ్యమంత్రి పేర్కొన్నారు. తాజాగా ప్రారంభించిన దివ్యాంగ శక్తి పథకం తనకు ఎంతో సంతృప్తి, ఆనందాన్ని కలిగించిందన్నారు. తాను, పవన్ కళ్యాణ్, లోకేష్ కలిసి ఈ పథకాన్ని ప్రారంభించి దివ్యాంగులతో కలిసి ముందుకు సాగడం గర్వకారణమని తెలిపారు.దివ్యాంగులు అంటే విభిన్న ప్రతిభావంతులు, సమస్యలను అధిగమించి విజయాలను సాధించే శక్తి ఉన్నవారిగా ఆయన అభివర్ణించారు. గతంలో చేయూత కార్యక్రమం ద్వారా దివ్యాంగులకు అండగా నిలిచామని, ట్రైసైకిళ్లతో పాటు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు టూ వీలర్లను అందించామని గుర్తుచేశారు. ప్రస్తుతం దివ్యాంగులకు పింఛన్ కింద నెలకు రూ.6 వేలు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం ఇదేనని పేర్కొన్నారు. గతంలో రూ.500గా ఉన్న పెన్షన్‌ను గణనీయంగా పెంచి అందిస్తున్నామని తెలిపారు. తీవ్రమైన ఆరోగ్య సమస్యలు ఉన్న వారికి రూ.10 వేలు, పూర్తిగా మంచానికి పరిమితమైన వారికి రూ.15 వేలు అందిస్తున్నట్లు వివరించారు. పింఛన్ల కోసం సంవత్సరానికి భారీగా ఖర్చు చేస్తున్నప్పటికీ, దివ్యాంగుల గౌరవం పెంచడమే తమ లక్ష్యమని స్పష్టం 2లో

## హెర్మూజ్‌పై హాట్ వార్
# బంకర్ బస్టర్లతో అమెరికా దాడి

మిత్రదేశాలు వెనకడుగు..
ఒంటరిగానే యుద్ధ సంకేతం..
చమురు రవాణాకు ముప్పు..
ఇరాన్ ప్రతిస్పందనపై ప్రపంచం ఉత్కంఠ..



**టెహ్రాన్ (తెలుగోడు), మార్చి 18 :**
పశ్చిమాసియాలో యుద్ధ ఉద్రిక్తతలు మరింత పెరుగుతున్నాయి. ప్రపంచ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధి వద్ద ఆధిపత్యం 2లో

# మొజ్తబాను ఎక్కడున్నా వెతికి చంపుతాం..ఇజ్రాయిల్

**టెహ్రాన్ (తెలుగోడు), మార్చి 18 :**



ఇరాన్, ఇజ్రాయెల్, అమెరికా మధ్య ఉద్రిక్తతలు మరింత తీవ్రరూపం దాల్చుతున్న నేపథ్యంలో గల్ఫ్ ప్రాంతం అంతటా భయాందోళనలు నెలకొన్నాయి. పరస్పర దాడులు, ప్రతిదాడులతో పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారుతోంది. ఈ క్రమంలో ఇరాన్‌కు చెందిన కొత్త సుప్రీం నాయకుడు ఆయతుల్లా మొజ్తాబా ఖమేనీపై ఇజ్రాయెల్ తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. 2లో




## అల్పపీడన ప్రభావంతో
# భారీ వర్షాలు



**పలు జిల్లాల్లో పిడుగులతో కూడిన వానలు**

**తాడేపల్లి (తెలుగోడు), మార్చి 18 :**
అల్పపీడన ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తాయని విశాఖపట్నం వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఏపీలో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని వెల్లడించారు. (మిగతా 2లో)

## పుట్టా మహేశ్ తీరు
# పార్టీకి మచ్చ



**ఇలాంటి వాళ్లను పార్టీ ఎందుకు మోయాలి.. తిరుపతి ఎమ్మెల్యేలతో సిఎం**

**అమరావతి (తెలుగోడు), మార్చి 18 :**
మొయినాబాద్ డ్రగ్స్ కేసులో పట్టుబడ్డ ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ కుమార్‌పై సీఎం చంద్రబాబు నాయుడు మండిపడ్డారు. పార్టీని ఇబ్బందుల్లోకి నెట్టే ఇలాంటి వాళ్లను మోయాలా..? అంటూ ఈ సమావేశంలో ఆయన అసహనం వ్యక్తం చేశారు. (మిగతా 2లో)

# నిర్ణీత సమయానికి పోలవరం పూర్తి


**గత పాలకుల తీరుతో ప్రాజెక్టులో జాప్యం...నిర్వాసితులతో సిఎం సమావేశం...నిర్వాసితులకు రూ.226 కోట్ల చెక్కు**



**అమరావతి (తెలుగోడు), మార్చి 18 :**
పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణాన్ని అనుకున సమయానికి పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. గత ప్రభుత్వం వల్ల ఆలస్యం జరిగిందని అన్నారు. సకాలంలో పూర్తి చేసి గోదావరి జలాలను అందుబాటులోకి తెస్తామని అన్నారు. ఈ సందర్భంగా ముంపు గ్రామాల నిర్వాసితులతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బుధవారం సమావేశం నిర్వహించారు. పునరావాస పరిహార ప్యాకేజీ మూడో విడతలో భాగంగా నిర్వాసితులకు రూ.226 కోట్ల చెక్కును సీఎం అందించారు.అనంతరం సీఎం మాట్లాడుతూ.. పోలవరం ప్రాజెక్ట్ రాష్ట్రానికి జీవనాడి అని, నదుల అనుసంధానం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ప్రయోజనాలు చేకూరుతాయని తెలిపారు. గత పాలకులు నిర్వాసితులను పట్టించుకోకుండా, వరదల్లో ప్రజలు మునిగిపోతున్నా నిర్లక్ష్యంగా వదిలేశారని సీఎం విమర్శించారు. ప్రాజెక్టు కోసం తమ ఇళ్లు, భూములను త్యాగం చేశారని సీఎం తెలిపారు. ఉగాది పండుగ సందర్భంగా రూ.226.6 కోట్లను నిర్వాసితుల ఖాతాల్లో జమ చేస్తున్నట్లు ప్రకటించారు. గతంలో సంక్రాంతి సందర్భంగా మొదటి విడతగా రూ.800 కోట్లు, దీపావళి సమయంలో రెండో విడతగా రూ.916 కోట్లు చెల్లించినట్లు గుర్తుచేశారు. 21 నెలల్లో 26,149 మంది నిర్వాసితులకు మొత్తం రూ.1,943.53 కోట్లు చెల్లించామని వివరించారు. మూడోసారి గోదావరి పుష్కరాల నిర్వహణకు ముందే ప్రాజెక్ట్‌ను పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని హామీ ఇచ్చారు. ప్రాజెక్ట్ పూర్తికి (మిగతా 2లో)

## న్యాయం కోసం
# పోరాటం చేస్తా

- అక్రమ కేసులపై హైకోర్టును ఆశ్రయించిన అంబటి..
- స్టేషన్ బెయిల్ ఇవ్వాల్సిన కేసుల్లో జైలుకు పంపారని ఆరోపణ...



**తాడేపల్లి (తెలుగోడు), మార్చి 18 :**
న్యాయస్థానాల తీర్పులకు విరుద్ధంగా పోలీసులు వ్యవహరించారని వైఎస్సార్సీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు ఆరోపించారు. తనపై నమోదు చేసిన అక్రమ కేసులపై హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసినట్లు తెలిపారు. బుధవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ సత్తెనపల్లి, నల్లపాడు, పట్టాభిపురం పోలీస్ స్టేషన్లలో తనపై అన్యాయంగా కేసులు నమోదు చేశారని పేర్కొన్నారు. 2లో

## పశ్చిమాసియా యుద్ధ వేళ
# కేబినెట్ కీలక భేటీ



- ప్రధాని అధ్యక్షతన కీలక సమావేశం..
- రూ.33,660 కోట్ల పారిశ్రామిక వికాస్ యోజనకు ఆమోదం..
- దేశవ్యాప్తంగా 100 పారిశ్రామిక నగరాల అభివృద్ధి లక్ష్యం..
- పత్తి రైతులకు రూ.11,712 కోట్ల మద్దతు..

**న్యూఢిల్లీ (తెలుగోడు), మార్చి 18 :**
పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్న వేళ కేంద్ర కేబినెట్ కీలక సమావేశం నిర్వహించింది. రెండు వారాలుగా ఇరాన్, ఇజ్రాయెల్, అమెరికా మధ్య యుద్ధ వాతావరణం నెలకొన్న నేపథ్యంలో ఈ భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది. ఇరాన్ రాజధాని టెహ్రాన్ సహా పలు ప్రాంతాలపై క్షిపణి దాడులు కొనసాగుతుండగా, లెబనాన్ రాజధాని బీరుట్‌పైనా తీవ్ర దాడులు జరుగుతున్నాయి. మరోవైపు అమెరికా, ఇజ్రాయెల్ సైనిక స్థావరాలపై ఇరాన్ ప్రతిదాడులు కొనసాగిస్తోంది. ఈ పరిణామాలతో అంతర్జాతీయ స్థాయిలో ఉద్రిక్తతలు పెరిగాయి.ఇలాంటి పరిస్థితుల్లో ప్రధాని అధ్యక్షతన జరిగిన (మిగతా 2లో)

# పాన్‌తో ఆధార్ లింక్
## మార్చి 31 వరకు గడువు



**న్యూఢిల్లీ (తెలుగోడు), మార్చి 18 :**
కొత్త పాన్ కార్డు పొందాలనుకుంటే దరఖాస్తుతో పాటు ఆధార్ కార్డు కాపీని జత చేస్తే సరిపోతుంది. అయితే రాబోయే ఆర్థిక సంవత్సరం నుంచి అలా కుదరదు. ఏప్రిల్ 1వ తేదీ తర్వాత కొత్త పాన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలంటే ఆధార్ కార్డుతో పాటు అదనపు డాక్యుమెంట్లను కూడా జత చేయాల్సి ఉంటుంది. కేవలం ఆధార్‌తోనే పాన్ పొందాలనుకుంటే మాత్రం మార్చి 31వ తేదీయే తుది గడువు అని కేంద్రానికి చెందిన కామన్ సర్వీస్ సెంటర్ తెలిపింది. బ్యాంకింగ్, ఆర్థిక లావాదేవీలకు సంబంధించి పాన్ కార్డు అత్యంత కీలకమనే సంగతి తెలిసిందే. ఇప్పటివరకు నూతన పాన్ కార్డు కోసం ఆధార్ కార్డు కాపీ ఇస్తే సరిపోయేది. అయితే ఏప్రిల్ 1 నుంచి ఆధార్‌తో పాటు బర్త్ సర్టిఫికెట్, ఓటర్ ఐడీ కార్డు, మెట్రిక్యులేషన్ సర్టిఫికెట్, డ్రైవింగ్ లైసెన్స్, పాస్‌పోర్ట్ వంటి వాటిల్లో ఏదో ఒకటి జత చేయాల్సి ఉంటుంది. ఎప్రిల్ ఒకటి తర్వాత పాత పాన్ దరఖాస్తు ఫారాలను కూడా అనుమతించేది ఉండదని కామన్ సర్వీస్ సెంటర్ పేర్కొంది. ఏప్రిల్ 1 నుంచి పాన్ దరఖాస్తు ఫారాలు కూడా మారతాయని, కొత్తవి అందుబాటులోకి వస్తాయని కామన్ సర్వీస్ సెంటర్ తెలిపింది.

## ప్రజాసేవలో
# పదవీ విరమణ లేదు

- రాజ్యసభ ఓ ఓపెన్ యూనివర్సిటీ..
- సీనియర్ సభ్యుల సేవలు ఇతరులకు ఆదర్శం..
- రిటైర్ అవుతున్న రాజ్యసభ సభ్యుల వీడ్కోలులో ప్రధాని మోడీ..
- మాతో ప్రేమాయణం..మోడీతో అనుబంధం..
- దేవేగౌడపై ఖర్గే ఛతురోక్తులు..



**న్యూఢిల్లీ (తెలుగోడు), మార్చి 18 :**
రాజ్యసభలో పదవీ విరమణ చేస్తున్న సభ్యులను ఉద్దేశించి ప్రధానమంత్రి మోదీ మాట్లాడుతూ, పదవీకాలం ముగిసినంత మాత్రాన ప్రజాసేవ ముగిసినట్టు కాదన్నారు. రాజ్యసభ మేధావుల వేదిక అని, ఇక్కడ లభించే జ్ఞానానికి విలువ కట్టలేమని అన్నారు. హెచ్‌డీ దేవెగౌడ, మల్లికార్జున్ ఖర్గే, శరద్ పవార్ వంటి దిగ్గజ నేతల సహకారాన్ని మరువలేమని, సగానికి పైగా తమ జీవితాన్ని పార్లమెంటుకే అంకితం చేశారని ప్రశంసించారు. కొత్తగా ఎన్నికైన ఎంపీలు వారి నుంచి నేర్చుకోవాల్సినది ఎంతైనా ఉంటుందని సూచించారు. రాజకీయాల్లో ఫుల్‌స్టాప్ ఉండదని ప్రధాని మోదీ అన్నారు.ఆయన రాజ్యసభలో ప్రసంగించారు. 59 మంది సభ్యులు రిటైర్ అవుతున్న నేపథ్యంలో ఆయన మాట్లాడారు. తన సందేశంతో ఆ సభ్యులకు వీడ్కోలు పలికిన ప్రధాని మోదీ మాట్లాడుతూ పార్లమెంట్ ఓ ఓపెన్ యూనివర్సిటీ లాంటిదన్నారు. రిటైర్ అయి వెళ్లిపోతున్న ఎంపీలు.. దేశం కోసం తమ విధులను నిర్వర్తిస్తూ ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఫేర్‌వెల్ లాంటి సందర్భాల్లో పార్టీల మధ్య ఉన్న విబేధాలు సమసిపోతాయన్నారు. మనలో ఒకేరకమైన భావోద్వేగం వస్తుందని, మనతో ఇన్నాళ్లు పనిచేసిన తోటి సభ్యులు తమ జీవితంలో మరో మార్గాన్ని (మిగతా 2లో)

# అట్టహాసంగా ప్రారంభమైన దివ్యాంగ శక్తి



(మొదటి పేజి (తరువాయి)

చేశారు. ఇప్పుడిప్పుడే ప్రారంభించిన దివ్యాంగ శక్తి పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా సుమారు 12.75 లక్షల మంది దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఎలాంటి ఖర్చు లేకుండా ఐదు రకాల బస్సుల్లో ప్రయాణించే అవకాశం కల్పించడం ద్వారా నెలకు సగటున రూ.2 వేల వరకు ఆదా అవుతుందని చెప్పారు. ఉద్యోగాలు, విద్య, వైద్య అవసరాల కోసం ఎటువంటి ఆర్థిక భారంలేకుండా ప్రయాణించే సౌలభ్యం ఈ పథకం ద్వారా లభిస్తుందని వివరించారు. మహిళల కోసం అమలు చేస్తున్న స్త్రీ శక్తి పథకం ఇప్పటికే విజయవంతమై 52 కోట్లకు పైగా ప్రయాణాలు నమోదయ్యాయని, అదే దిశగా ఇప్పుడు దివ్యాంగ శక్తి పథకం కూడా లక్షల మందికి ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేసే ప్రతి పథకం నిరుపేదల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని రూపొందించబడిందని చెప్పారు. ఎక్కువ సమస్యలు ఎదుర్కొనే దివ్యాంగులకు అండగా నిలబడటం తమ బాధ్యతగా భావిస్తున్నామని స్పష్టం చేశారు. దివ్యాంగుల సమస్యలపై నిరంతరం పోరాటాలు చేస్తున్న మంద కృష్ణమాదిగ, గోనుగుంట్ల కోటేశ్వరావులను ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అభినందించారు. పథకంపై లబ్దిదారుల నుంచి వస్తున్న సానుకూల స్పందన ప్రభుత్వానికి మరింత ఉత్సాహాన్ని ఇస్తోందన్నారు. దివ్యాంగ శక్తి పథకం ద్వారా ఈ ఉగాది మరింత ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ రాష్ట్ర ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.

# న్యాయం కోసం పోరాడుతా

(మొదటి పేజి (తరువాయి)

ఏడేళ్లలోపు శిక్ష పడే కేసుల్లో స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపాల్సి ఉంటుందని, కానీ తనను 18 రోజులు సెంట్రల్ జైలులో ఉంచారని విమర్శించారు. అలాంటి కేసుల్లో ముద్దాయిని కోర్టులో ప్రవేశపెట్టాల్సిన అవసరం లేదని గత తీర్పులు స్పష్టం చేస్తున్నాయని తెలిపారు. అయినప్పటికీ చట్టాన్ని పోలీసులు ఉల్లంఘించి రాజకీయ ఒత్తిళ్లతో కోర్టులో హాజరుపరిచారని మండిపడ్డారు. తన అరెస్టు, రిమాండ్ విధించిన విధానంపై న్యాయపోరాటం కొనసాగిస్తున్నానని తెలిపారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు విరుద్ధంగా వ్యవహరించి జైలుకు పంపారని ఆరోపించారు. తనపై ఉన్న అన్ని కేసులు ఏడేళ్లలోపు శిక్ష పడేవేనని, అయినప్పటికీ ఎక్కువకాలం జైల్లో ఉంచేందుకు ప్రయత్నించారని అన్నారు. ఈ అంశంపై హైకోర్టు రిజిస్ట్రార్‌కు కూడా ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. తన ఇల్లు, కార్లపై దాడి చేసి ధ్వంసం చేసిన వారికి స్టేషన్ బెయిల్ ఇచ్చారని ప్రశ్నించారు. ఈ వ్యవహారంపై కూడా న్యాయపోరాటం చేస్తానని స్పష్టం చేశారు. లాకప్‌లో తనపై హింస జరిగిందని, కస్టోడియల్ టార్చర్‌పై కూడా చట్టపరంగా పోరాడతానని తెలిపారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి ఘటనలు జరగకూడదని పేర్కొన్నారు. ఏడు గంటలకుపైగా తన ఇంటిపై దాడి జరిగినప్పటికీ పోలీసులు అడ్డుకోలేదని విమర్శించారు. తమ కళ్ల ముందే జరిగిన విధ్వంసాన్ని అరికట్టని పోలీసులు కూడా బాధ్యులేనని అన్నారు. రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ సరిగా పనిచేయడం లేదని, ఇది ఆ సంఘటనతో స్పష్టమైందన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా విఫలమయ్యాయని అంబటి రాంబాబు ఆరోపించారు. పోలీసులను ప్రభావితం చేస్తే ఏదైనా చేయొచ్చని భావన పెరిగితే అరాచకం తప్పదన్నారు. ప్రజలకు రక్షణ కల్పించాల్సిన వ్యవస్థ వైఫల్యం చెందిందని పేర్కొన్నారు. పోలీసింగ్ అనే పేరుతో ప్రజలను భయపెట్టే పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. న్యాయవ్యవస్థ మాత్రమే ప్రజలకు చివరి ఆశగా మిగిలిందని, చట్టంపై గౌరవం నిలబెట్టేందుకే తన పోరాటమని స్పష్టం చేశారు.

# ప్రజాసేవలో పదవీ విరమణ లేదు

(మొదటి పేజి (తరువాయి)

అన్వేషించబోతున్నారని గ్రహిస్తామని ప్రధాని పేర్కొన్నారు. అయితే మళ్లీ రాజ్యసభకు రాలేని వారిని ఉద్దేశిస్తూ.. రాజకీయాల్లో ఫుల్ స్టాప్ అంటూ ఉండదని, మీ కోసం భవిష్యత్తు ఎదురుచూస్తోందని, ఈ దేశ నిర్మాణం కోసం మీ అనుభవాలు చాలా అవసరం ఉంటుందని ప్రధాని తెలిపారు. డిప్యూటీ చైర్మెన్ హరివంశ్ గురించి కూడా ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఆయన చాలా మృదుస్వభావి అని అన్నారు. కానీ నిత్యం కార్యాచరణలో నిమగ్నమై ఉంటాడన్నారు. కేంద్ర మంత్రి రాందాస్ అత్వాలే గురించి మాట్లాడుతూ ఆయన నిజంగా ఎవర్‌గ్రీన్ అన్నారు. సభ బయట కూడా ఆయన వ్యంగాన్ని , హాస్యాన్ని ప్రదర్శించాలని ఆశించారు. పార్లమెంట్ పక్రియలో ఉన్న ఉభయసభల విధానం గురించి ప్రధాని మోదీ ప్రస్తావిస్తూ.. ఓ చట్టానికి ఆమోదం దక్కాలంటే రెండో అభిప్రాయం అవసరంమని, అలాంటి విధానం వల్ల ప్రజాస్వామ్యం మరింత బలపడుతుందని పేర్కొన్నారు. ఒక సభలో తీసుకున్న నిర్ణయం.. రెండో ఓపీనియన్ కోసం మరో సభకు వెళుతుందని, అక్కడ జరిగిన చర్చతో నిర్ణయాత్మక విధానం కొత్త రూపు సంతరించుకుంటుదని ప్రధాని అన్నారు. రాజ్యసభలో పదవీకాలం ముగిసిన సభ్యుల వీడ్కోలు సభలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే బుధవారం నాడు కాసేపు నవ్వులు పూయించారు. మాజీ ప్రధాని హెచ్‌డీ దేవెగౌడను ఉద్దేశించి మాట్లాడుతూ, గత 54 ఏళ్లుగా ఆయన తనకు తెలుసని, ఆయనతో కలిసి పనిచేశానని చెప్పారు. 'అయితే ఏమి జరిగిందో తెలియదు కానీ, ఆయన మాతో ప్రేమ సాగించి మోదీని పెళ్లి చేసుకున్నారు' అంటూ చమత్కరించారు. దీంతో సభలో ఉన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో సహా సభ్యులంతా నవ్వులు చిందించారు. దేశానికి సేవ చేయాలనే తపన కలిగిన వారు రాజకీయాల్లో, ప్రజా జీవితంలో ఎన్నడూ అలసిపోరని ఖర్గే అన్నారు. దేవెగౌడ 1996 లోక్‌సభ ఎన్నికల తర్వాత సుమారు ఒక ఏడాది పాటు ప్రధానమంత్రిగా ఉన్నారు. దేవెగౌడ సారథ్యంలోని యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వానికి కాంగ్రెస్ మద్దతిచ్చింది. 2018 కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో హెచ్‌డీ దేవెగౌడ 'జేడీఎస్'తో కాంగ్రెస్ పొత్తు సాగించింది. ఆ కూటమి విజయం సాధించింది. దేవెగౌడ కుమారుడు హెచ్‌డీ కుమారస్వామి ముఖ్యమంత్రి అయ్యారు. అయితే 2019లో పలువురు కాంగ్రెస్, జేడీఎస్ ఎమ్మెల్యేలు తిరుగుబాటు చేయడంతో కుమారస్వామి ప్రభుత్వం కూలిపోయింది. ఆ తర్వాత బీజేపీతో జేడీఎస్ పొత్తు పెట్టుకుంది. కాగా, రాజ్యసభ సభ్యుల వీడ్కోలు సెషన్‌లో శరద్ పవార్, డీఎంకే నేత తిరుచ్చి శివతో తన అనుబంధాన్ని కూడా ఖర్గే గుర్తుచేసు కున్నారు. అయితే పవార్, తిరుచ్చి శివ తిరిగి రాజ్యసభకు రాబోతున్నారు. ఖర్గే తన ప్రసంగంలో కేంద్ర మంత్రి, ఆర్‌పీఐ(ఏ) చీఫ్ రామ్‌దాస్ అథవాలేపై కూడా ఛలోక్తులు విసిరారు. 'ఆయన ఎప్పుడూ తన కవితల్లో మోదీని పొగుడుతుంటారు. ఆయనకు మరే ఇతర కవితలు తెలియవేమో' అంటూ చమత్కరించారు.

# కేంద్రమంత్రి గడ్కరీతో రాహుల్, ప్రియాంకల భేటీ



న్యూ ఢిల్లీ (తెలుగోడు), మార్చి 18 :

కాంగ్రెస్ నేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా బుధవారంనాడు పార్లమెంటు హౌస్‌లో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరిని కలుసుకున్నారు. రాజస్థాన్‌కు చెందిన బస్ అండ్ ట్రక్ బాడీ బిల్డర్స్ ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకు వచ్చారు. బస్ అండ్ ట్రక్ బాడీ బిల్డర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. నూతన రెగ్యులేటరీ ప్రమాణాలు, హెచ్చు ఫీజుల వల్ల తాము వ్యాపారాలను మానుకోవాల్సిన పరిస్థితి తలెత్తిందని, ఇందువల్ల తామ జీవనోపాధి కోల్పోవాల్సి వస్తుందని వివరించారు. గడ్కరితో సమావేశానంతరం రాహుల్ గాంధీ మాట్లాడుతూ, లైసెన్స్ పక్రియ ఖరీదైన వ్యవహారంగా మారడం, కాలహరణం జరుగుతుండటం వంటివి చోటుచేసుకుంటున్నాయని, ఈ విషయాన్ని గడ్కరి దృష్టికి తెచ్చామని చెప్పారు. సాధ్యమైనంత త్వరగా సమస్యలను పరిష్కరిస్తామని గడ్కరి హామీ ఇచ్చినట్టు తెలిపారు.

# హొర్ముజ్ వద్ద హాట్ వార్



(మొదటి పేజి (తరువాయి)

పశ్చిమాసియాలో యుద్ధ ఉద్రిక్తతలు మరింత పెరుగుతున్నాయి. ప్రపంచ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధి వద్ద ఆధిపత్యం కోసం అమెరికా సరికొత్త యుద్ధ తంత్రాన్ని అమలు చేస్తోంది. ఇరాన్ ఆధీనంలో ఉన్న వ్యూహాత్మక భూగర్భ క్షిపణి స్థావరాలను లక్ష్యంగా చేసుకొని అత్యంత శక్తివంతమైన బంకర్ బస్టర్ బాంబులతో దాడులు చేపట్టింది. అంతర్జాతీయ నౌకాయానానికి ముప్పుగా మారిన ఇరాన్ యాంటీ-షిప్ క్రూయిజ్ క్షిపణులను అడ్డుకోవడమే లక్ష్యంగా ఈ దాడులు నిర్వహించినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ అధికారికంగా ప్రకటించింది. ఈ దాడుల్లో దాదాపు 2,200 కిలోల బరువున్న బాంబులను వినియోగించడం గమనార్హం. మిత్రదేశాలు యుద్ధ నౌకలను పంపడంలో వెనకడుగు వేస్తున్నాయని అమెరికా అధ్యక్షుడు ప్రకటించిన కొద్ది గంటల వ్యవధిలోనే ఈ దాడులు జరగడం పరిస్థితుల తీవ్రతను చూపిస్తోంది. మిత్రదేశాల సహకారం లేకపోయినా, ఒంటరిగానే ఇరాన్‌ను ఎదుర్కొనేందుకు సిద్ధమని అమెరికా ఈ చర్యల ద్వారా స్పష్టమైన సంకేతం ఇచ్చింది. సాధారణ బాంబులతో పోలిస్తే బంకర్ బస్టర్ బాంబులు భూమిలోకి లోతుగా చొచ్చుకుపోయి, భూగర్భంలో నిర్మించిన కాంక్రీట్ స్థావరాలను కూడా ధ్వంసం చేయగలవు. గతంలో ఇరాన్ అణు కేంద్రాలను లక్ష్యంగా చేసుకున్న దాడుల్లో మరింత భారీ బాంబులను కూడా ఉపయోగించినట్లు సమాచారం. ఒక్కో బాంబు తయారీకి భారీ ఖర్చు అవుతున్నప్పటికీ, వ్యూహాత్మక లక్ష్యాలను ఛేదించడంలో వీటి పాత్ర కీలకంగా మారింది.

ఈ దాడుల నేపథ్యంలో హోర్ముజ్ జలసంధి గుండా జరిగే చమురు సరఫరాకు ఆటంకం కలిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఇప్పటికే పెరుగుతున్న ఉద్రిక్తతల కారణంగా అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలు ఎగబాకుతున్నాయి. ఇరాన్ దీనిపై ఎలా స్పందిస్తుందనేది ఇప్పుడు ప్రపంచ దేశాల్లో ఉత్కంఠ రేపుతోంది. పరిస్థితులు మరింత ఉద్రిక్తతకు దారితీసే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# నిర్ణీత సమయానికి పోలవరం పూర్తి



(మొదటి పేజి (తరువాయి)

మరో రూ.5 వేల కోట్లు అవసరమని, ఒక వంతెన కూడా నిర్మిస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. నిర్వాసితుల త్యాగానికి ప్రతిఫలం పోలవరం ప్రాజెక్ట్ అని సీఎం పేర్కొన్నారు. నిర్వాసితులకు పారదర్శకంగా చెల్లింపులు జరుపుతున్నామని చెప్పారు. దళారులను నమ్మవద్దని సూచించారు. ప్రాజెక్ట్ ప్రారంభానికంటే ముందే నిర్వాసితులందరికీ న్యాయం చేస్తామని సీఎం హామీ ఇచ్చారు. పోలవరం నిర్వాసితుల పట్ల కూటమి ప్రభుత్వానికి కమిట్‌మెంట్ ఉందని.. నిర్వాసిత యువతకు స్కిల్ డెవలప్‌మెంట్ కూడా చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. ప్రాజెక్ట్ రెండు దశలుగా నిర్మాణం జరుగుతోందన్నారు సీఎం. తొలి దశలో 38,068 మంది నిర్వాసితులు ఉన్నారని తెలిపారు. ప్రతి నిర్వాసితుడికి ఇంటి నిర్మాణానికి రూ.3.5 లక్షలు ఇస్తున్నామని, ఇంటి జాగా కోసం రూ.2 లక్షలకు పెంచినట్లు వివరించారు. కేంద్ర ప్రాజెక్ట్ అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం నిబద్ధతతో పనులు చేపడుతోందని తెలిపారు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా డయాఫ్రం వాల్ దెబ్బతిన్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. గత పాలకుల నిర్లక్ష్యంతో రూ.440 కోట్ల వ్యయంతో కట్టిన డయాఫ్రం వాల్ కొట్టుకుపోయిందని.. ఇప్పుడు మళ్లీ రూ.వెయ్యి కోట్లతో నిర్మాణం చేపట్టామన్నారు. 6 -7 ఏళ్ల పాటు ప్రాజెక్ట్ ఆలస్యమై పోయిందని.. ప్రాజెక్టు ఏమైనా పర్వాలేదనే అహంకార ధోరణితో గత పాలకులు వ్యవహరించారని మండిపడ్డారు. వారం రోజుల్లో డయాఫ్రం వాల్ పూర్తవుతుందని, ప్రాజెక్ట్ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ సమావేశానికి జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు,

# ఏపీలో రూ 70,232కోట్లతో రైల్వే ప్రాజెక్ట్ పనులు

## త్వరలో విశాఖ రైల్వే జోన్ కార్యకలాపాలు ..రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడి

న్యూ ఢిల్లీ (తెలుగోడు), మార్చి 18 :

త్వరలో విశాఖ రైల్వే జోన్ కార్యకలాపాలు ప్రారంభం కానున్నాయని రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. విశాఖ రైల్వే జోన్‌పై ఆయన పార్లమెంట్‌లో లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. జనరల్ మేనేజర్, ఇతర ఉన్నతాధికారుల నియామకాలు పూర్తయ్యాయని వెల్లడించారు. జోన్ ప్రధాన కార్యాలయ భవనం పునాది పనులు పూర్తయ్యాయని చెప్పారు. ఎర్రుపాలెం-అమరావతి-నంబూరు లైన్‌కు రూ.2,047 కోట్లు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. ఏపీలో రూ.70,232 కోట్లతో రైల్వే ప్రాజెక్టుల పనులు జరుగుతున్నాయని వివరించారు. . రైల్వేజోన్ కోసం జనరల్ మేనేజర్, ఇతర ఉన్నతాధికారుల నియామకం పూర్తి చేస్తామని కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ పేర్కొన్నారు. 2009-2014 మధ్య సగటున రూ. 886 కోట్లు ఉంటే, 2025- 26లో ఆంధ్రప్రదేశ్‌కు రికార్డు స్థాయిలో రూ.9,417 కోట్ల కేటాయింపులు జరిగాయని స్పష్టం చేశారు. గతంతో పోలిస్తే రైల్వేట్రాక్ నిర్మాణ వేగం రెట్టింపు అయిందని వివరించారు. ప్రతి ఏటా సగటున 143 కిలోమీటర్ల మేర కొత్త ట్రాక్ పనులు జరుగుతున్నాయని వెల్లడించారు. ఎర్రుపాలెం - అమరావతి - నంబూరు కొత్త రైల్వేలైన్ (57 కిలోమీటర్లు) కోసం రూ. 2047 కోట్లు మంజూరు చేశామని తెలిపారు. ప్రస్తుతం భూసేకరణ పక్రియ ప్రారంభమైందన్నారు. ఏపీలో ప్రస్తుతం రూ. 70,232 కోట్ల విలువైన 39 రైల్వే ప్రాజెక్టులు (కొత్త లైన్లు, డబ్లింగ్) పనులు కొనసాగుతున్నాయని చెప్పుకొచ్చారు. విజయవాడ - గూడూరు మూడవ రైల్వేలైన్, గుంతకల్ - గుంటూరు డబ్లింగ్ పనులు శరవేగంగా జరుగుతున్నాయని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ వివరించారు.

# వెతికి చంపుతాం..ఇజ్రాయిల్

(మొదటి పేజి (తరువాయి)

ఎక్కడ ఉన్నా వెంబడించి అంతం చేస్తామని స్పష్టం చేసింది. తమ దేశానికి ముప్పుగా ఉన్నవారిని ఎట్టి పరిస్థితుల్లోనూ విడిచిపెట్టబోమని ఇజ్రాయెల్ రక్షణ దళాలు వెల్లడించాయి. ఖమేనీ ప్రస్తుతం ఎక్కడ ఉన్నారనే విషయంపై స్పష్టమైన సమాచారం తమ వద్ద లేకపోయినా, తమ లక్ష్యం మాత్రం మారదని పేర్కొన్నాయి. తమకు వ్యతిరేకంగా పనిచేసే వ్యక్తులు ఎక్కడ దాక్కున్నా వెంబడించి నిర్మూలిస్తామని హెచ్చరించాయి. ఎప్పుడు, ఎక్కడ చర్యలు తీసుకుంటామన్నది ముందుగా వెల్లడించలేమని, కానీ లక్ష్యం మాత్రం తప్పదని స్పష్టం చేశాయి. ఇక ఖమేనీ దాడుల్లో గాయపడి చికిత్స కోసం రష్యాకు తరలించబడ్డారని వచ్చిన వార్తలను ఇరాన్ ఖండించింది. తమ నాయకులు ఎవరూ పారిపోవడం లేదని, షెల్టర్లలో దాక్కోవాల్సిన పరిస్థితి లేదని తెలిపింది. ప్రజల మధ్యే తమ నాయకులు ఉన్నారని, ఎలాంటి భయాందోళనలు అవసరం లేదని ఇరాన్ వర్గాలు వెల్లడించాయి. ఈ పరిణామాలతో గల్ఫ్ ప్రాంతంలో ఉద్రిక్తతలు మరింత పెరుగుతున్నాయి.

# అల్పపీడన ప్రభావంతో భారీ వర్షాలు

(మొదటి పేజి (తరువాయి)

విశాఖపట్నం కేంద్రంగా గల్ఫ్ ఆఫ్ మన్నార్ నుంచి దక్షిణ అంతర కర్ణాటక మీదుగా తమిళనాడు వరకు అల్పపీడన ద్రోణి కొనసాగుతోందని తెలిపారు. వాతావరణంలో చోటుచేసుకున్న మార్పులతో ఆగ్నేయ, నైరుతి దిశల నుంచి గాలులు బలంగా వీస్తాయని చెప్పుకొచ్చారు. దీని ప్రభావంతో ఏపీలోని పలు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు పడతాయని తెలిపారు. రాబోయే మూడు రోజుల పాటు వానలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు. వర్షాల నేపథ్యంలో ఏపీ ప్రభుత్వం అప్రమత్తమైంది. అధికారులకు పలు కీలక సూచనలు చేసింది. ఈ వర్షాల ప్రభావం ముఖ్యంగా అమలాపురం, తణుకు, రాజోలు, భీమవరం, గుడివాడ, గన్నవరం, మచిలీపట్నం, అంబేద్కర్ కోనసీమ జిల్లా, పశ్చిమ గోదావరి జిల్లా, కృష్ణా జిల్లా, నంద్యాల పరిసర ప్రాంతాలు, ఏలూరు జిల్లాలోని పలు ప్రాంతాల్లో అక్కడక్కడా ఈదురుగాలులతో పాటు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. నూజివీడు ప్రాంతంలో ఇప్పటికే ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈ వర్షాలు వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావాన్ని చూపించనున్నాయి. ఏలూరు జిల్లా, పరిసర ప్రాంతాల్లో సుమారు 35,000 హెక్టార్లలో మామిడి పంట సాగులో ఉంది. ప్రస్తుతం ఈదురుగాలుల కారణంగా మామిడి పూత రాలిపోతోంది. మామిడి పిందెలు నేలపై పడిపోతున్నాయని, దీనివల్ల పంట దిగుబడి తగ్గే ప్రమాదం ఉందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. వర్షాల నేపథ్యంలో వాతావరణ శాఖ అధికారులు ప్రజలకు కొన్ని సూచనలు జారీ చేశారు. ఉరుములు, మెరుపుల సమయంలో బయటకు వెళ్లవద్దని తెలిపారు. చెట్ల కింద నిలబడవద్దని సూచించారు. ప్రయాణాల సమయంలో జాగ్రత్తలు పాటించాలని అన్నారు.

# పుట్టా మహేశ్ తీరు పార్టీకి మచ్చ

(మొదటి పేజి (తరువాయి)

బుధవారం తిరుపతి ఎమ్మెల్యేలతో సీఎం చంద్రబాబు సమావేశమయ్యారు. ఈ సమావేశంలో పుట్టా మహేశ్ కుమార్ వ్యవహారాన్ని సీఎం చంద్రబాబు ప్రస్తావించారు. యువకుడు.. రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి వచ్చారని అతడికి అవకాశమిచ్చామని వివరించారు. కానీ ఆయన ఈ విధంగా వ్యవహరించారన్నారు. అసలు ఆ పార్టీలకు వెళ్లాల్సినంత అవసరం ఏమొచ్చిందంటూ ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. గతంలో క్రమశిక్షణ ఉల్లంఘించిన వాళ్లు ఎంతటి పెద్ద వాళ్లైనా ఉపేక్షించకుండా చర్యలు తీసుకున్నానని సీఎం చంద్రబాబు గుర్తు చేశారు. క్రమశిక్షణ, విలువలు పాటించకుండా రాజకీయం చేయాలనుకోవడం కరెక్ట్ కాదని ఆయన అభిప్రాయపడ్డారు. పార్టీ ప్రతిష్ఠ దెబ్బతింటుంటే చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. టీడీపీలో నాయకులంతా క్రమశిక్షణతో మెలగాల్సిందేనని.. ఎవరికీ వెసులుబాటు ఉండదని ఎమ్మెల్యేలకు సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

# కేబినెట్ కీలక భేటీ

(మొదటి పేజి (తరువాయి)


కేంద్ర కేబినెట్ సమావేశంలో దేశ ఆర్థిక, మౌలిక సదుపాయాల అభివృద్ధికి సంబంధించిన పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. సమావేశం అనంతరం కేంద్ర మంత్రి వెల్లడించిన వివరాల ప్రకారం రూ.33,660 కోట్ల వ్యయంతో 'భారత్ ఆధ్యోగిక వికాస్ యోజన' పథకానికి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. దేశాన్ని స్వయం సమృద్ధిగా తీర్చిదిద్దడం ఈ పథకం ప్రధాన లక్ష్యంగా ఉండగా, దేశవ్యాప్తంగా 100 పెద్ద పారిశ్రామిక నగరాలను అభివృద్ధి చేయాలని నిర్ణయించారు.

అదే విధంగా 2023-24 పత్తి సీజన్‌కు కనీస మద్దతు ధర రీయింబర్స్‌మెంట్ కోసం రూ.11,712 కోట్లు కేటాయించారు. రైతులకు ఆర్థిక భరోసా కల్పించే దిశగా ఈ నిర్ణయం ఉపయుక్తంగా ఉండనుంది. జాతీయ రహదారి అభివృద్ధిలో భాగంగా బారాబంకి నుండి బహ్రైచ్ వరకు నాలుగు లేన్ల రహదారి నిర్మాణానికి రూ.6,969 కోట్లు మంజూరు చేశారు. రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు ప్రాంతీయ అభివృద్ధికి ఇది దోహదం చేయనుంది. చిన్న జలవిద్యుత్ అభివృద్ధి పథకానికి రూ.2,585 కోట్లు కేటాయిస్తూ 2026-27 నుండి 2030-31 వరకు అమలు చేయాలని నిర్ణయించారు. దేశవ్యాప్తంగా సుమారు 1500 మెగావాట్ల సామర్థ్యంతో ప్రాజెక్టులను అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ముఖ్యంగా 1 నుంచి 25 మెగావాట్ల సామర్థ్యం గల ప్రాజెక్టులకు ప్రోత్సాహం అందించనున్నారు. ఈ పథకం ద్వారా కొండ ప్రాంతాలు, ఈశాన్య రాష్ట్రాలకు అధిక ప్రయోజనం చేకూరే అవకాశం ఉంది.

# ఉగాది పచ్చడి వైశిష్ట్యం...కాలంలో మార్పులను తట్టుకునే ఔషధం

శ్రీశైలం (తెలుగోడు), మార్చి 18 :

తెలుగువారి కొత్త సంవత్సరం ప్రారంభం కానుంది. తెలుగు పంచాంగం ప్రకారం చైత్రమాసం శుద్ధ పాడ్యమి రోజున ఉగాది పండుగతో కొత్త సంవత్సరం ఆరంభం కానుంది. ఈ ఏడాది ఉగాది పండుగ మార్చి 19న వచ్చింది. ఉగాది పండుగ రోజు అందరూ కచ్చితంగా ఉగాది పచ్చడి తినాలని పండితులు చెబుతుంటారు. అసలు ఆ రోజు ఉగాది పచ్చడి ఎందుకు తినాలి. ఎన్ని రోజులు వసంత గమన శుభవేళ.. పచ్చగా కళకళలాడే ప్రకృతి పరంగా.. రేవతి నక్షత్ర ప్రవేశంతో.. చైత్ర శుద్ధ పాడ్యమి గురువారం రోజున ఉగాది పండుగ .. శ్రీ పరాభవ నామ సంవత్సర కాలగమనం ఆరంభమవుతుంది. ఉగాది పచ్చడిని ఒక్కో చోట ఒక్కో విధంగా తయారు చేస్తుంటారు. అందులో తీపి, పులుపు, ఉప్పు, కారం, చేదు, వగరు అనే ఆరు రుచులను తప్పకుండా ఉండేలా చూస్తారు. ఈ పచ్చడి కోసం చెరకు, అరటి పళ్ళు, మామిడి కాయలు, వేప పువ్వు చింతపండు, జామకాయలు, బెల్లం, జీలకర్ర, మిరపకాయ వంటివి వాడుతుంటారు. ఇన్ని కలిపి చేసిన ఉగాది పచ్చడిని ఒక మహౌషధమని అంటారు పెద్దలు. ఈ ఉగాది పచ్చడిని ఈ పండుగ నుంచి శ్రీరామనవమి వరకూ లేదాచైత్ర పౌర్ణమి వరకు ప్రతిరోజూ ఉంటే శరీరంలో రోగ నిరోధక శక్తి పెరుగుతుందని. ఆ సంవత్సరమంతా రోగాలేవీ దరిచేరవనే నమ్మకం కూడా ఉంది. ఆయుర్వేద శాస్త్రం ప్రకారం ఉగాది పచ్చడిని నింబకుసుమ భక్షణం...అశోకకళికా ప్రాశనం అంటారు. రుతువులలో వచ్చే మార్పుల వల్ల వచ్చే రోగాల నుంచి రక్షణగా, ఈ పచ్చడిని ఔషధంగా తీసుకోవడం పూర్వం నుంచే అనవాయితీగా వస్తోంది. పచ్చడిలో ఉండే వేప పువ్వు కడుపులో ఉన్న నులిపురుగులను చంపేస్తుంది. వేపగాలి ఆటలమ్మ అమ్మోరు వంటి అంటురోగాలను దగ్గరకి రానివ్వకుండా కాపాడుతుంది మామిడి యాంటీ వైరల్ లక్షణాలు కలిగి ఉంది. మిరియాలు దగ్గు జలుబు, పైత్యాలను అదుపులో ఉంచుతాయి. బెల్లం రక్తాన్ని శుద్ధి చేస్తుంది. చింతపండు మలబద్ధకాన్ని, నీరసాన్ని తగ్గిస్తుంది. ఉప్పు ఎండాకాలంలో వచ్చే హైడ్రేషన్ని తగ్గిస్తుంది. సంవత్సరం అంతా ఎదురయ్యే మంచి చెడులను, కష్ట సుఖాలను సమానంగా తీసుకోవాలనే సందేశాన్ని కూడా ఉగాది పచ్చడి ఇస్తుంది. బెల్లం- తీపి అనేది సంతోషానికి, ఉప్పు- జీవితంలో ఉత్సాహానికి... వేప పువ్వు- చేదు బాధ తాలూకు అనుభవాలకు, చింతపండు-పులుపు నేర్పుగా వ్యవహరించాల్సిన పరిస్థితులకు, పచ్చి మామిడి ముక్కల పులుపు- కొత్త సవాళ్లకు.. కారం సహనం కోల్పోయేట్టు చేసే పరిస్థితులకు సంకేతం అని చెప్తారు. ఉగాది పచ్చడి ఒక మహౌషధమని పెద్దలు చెబుతుంటారు. ఈ ఉగాది పచ్చడిని శ్రీరామ నవమి వరకూ లేదా చైత్ర పౌర్ణమి వరకు ప్రతిరోజూ తీసుకోవాలి. అలా 9 లేదా15 రోజుల పాటు ఈ ఉగాది పచ్చడి తినడం వల్ల శరీరంలో రోగ నిరోధక శక్తి పెరుగుతుందంటారు. ఉగాది పచ్చడిలో ఉండే వేప పువ్వు కడుపులో ఉన్న నులిపురుగులను చంపేస్తుంది. వేపగాలి ఆటలమ్మ, అమ్మోరు మొదలైన వ్యాధులను దగ్గరకు రానీయదు. మామిడి యాంటీ వైరల్ లక్షణాలు కలిగి ఉన్నది. ఇది కఫము, వాతము, పైత్యాలనే మూడు దోషాలను అదుపులో ఉంచుతుంది. మనకు వచ్చే జబ్బుల్లో చాలా వరకూ వీటివల్లే



వస్తాయి.. 'శతాయుర్వజ్ర దేవయ సర్వ సంపత్రాయచ.. సర్వతిష్ట వినాశయ నిబంకదళ బక్షణమ్' అనే శ్లోకం పఠించి ఉగాది ప్రసాదాన్ని స్వీకరించాలి. పంచాంగ శ్రవణం వినాలి. మంచి ఆశయాలతో ముందడుగు వేయాలి. ఆ రోజున (మార్చి 19) పంచాంగాన్ని విన్న పక్షంలో ఏ గ్రహం మనకి అనుకూలంగా లేదో, ఎవరు మనకి సహాయకులో తెలిసి, ఏయే కష్ట నష్టాలో తెలుసుకొని వాటికి సంబంధించిన ప్రత్యామ్నాయ మార్గాలను ఎన్నుకో గలుగుతామని పండితులు చెబుతున్నారు.



నిత్యావసరాలు అందిస్తున్న దృశ్యం

## పేద కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ

**అనంతపురం రూరల్ (తెలుగోడు), మార్చి 18 ::**
నిత్యసురభి చారిటబుల్ ట్రస్ట్, పుట్టినిల్లు ఆశ్రమం చైర్ పర్సన్ శ్రీమతి. డా.ఎస్. నిర్మలమురళి, ట్రస్ట్ ఉపాధ్యక్షుడు కవీన్ ఆదిత్య ఆధ్వర్యంలో 10 పేద కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ట్రస్ట్ సభ్యులు శ్రీమతి అనిత, మాధవరెడ్డి దంపతుల కుమార్తె దివ్యసాయిరత్న పుట్టినరోజు సందర్భంగా ఈ కార్యక్రమానికి సహకారం అందించారు. అలాగే ఉగాది పండుగను పురస్కరించుకొని నగర శివారు కాలనీలకు చెందిన 10 పేద కుటుంబాలను ఎంపిక చేసుకొని బుధవారం పుట్టినిల్లు ఆశ్రమంలో 22 రకాల నిత్యావసర వస్తువులను ట్రస్ట్ చైర్ పర్సన్ నిర్మలమురళి, ట్రస్ట్ ఉపాధ్యక్షుడు కవీన్ ఆదిత్య అందించారు. ఈ సందర్భంగా నిర్మలమురళి మాట్లాడుతూ ఉగాది పండుగను పేద ప్రజలంతా అందరితో కలిసి సంతోషంగా జరుపుకోవాలన్నారు. అవసరంలోను ఆపదలోను ఉన్న పేదలకు వీలున్నవారు ఏదో ఒక రూపంలో సహాయం చేయాలన్నారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇప్పటికే పేద కుటుంబాలకు అనేక రకాలుగా సహాయ సహకారాలు అందిస్తున్నామని తెలిపారు. ప్రజలందరికీ ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

## ఉగాది, రంజాన్ పర్వదినాలను భక్తిశ్రద్ధలతో జరుపుకోండి

*ఎస్సై నాగ మధు..*

**కనేకల్ (తెలుగోడు), మార్చి 18 :**
నూతన తెలుగు సంవత్సరాది ఉగాది పండుగ, ముస్లింల పవిత్ర రంజాన్ పర్వదినాలను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఎస్సై నాగమధు ప్రజలకు సూచించారు. ఈ తెలుగు సంవత్సరాదిలో ప్రజలకు అన్నీ శుభాలు జరగాలని, ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలు, సిరిసంపదలతో ప్రశాంత జీవనం గడపాలని ఆకాంక్షించారు. తీపి, పులుపు, కారం, ఉప్పు, వగరు, చేదుల సమ్మేళనమే ఉగాది పచ్చడని, సంవత్సరం పొడుగునా ఎదురయ్యే మంచి చెడులను, కష్ట, సుఖాలను, స్వీకరించాలన్న సందేశాన్ని స్వీకరిస్తూ ఇంటిల్లిపాది ఉగాది పండుగను సంప్రదాయబద్ధంగా, సుఖ సంతోషాలతో జరుపుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.




అదేవిధంగా క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనల కలయికే రంజాన్ మాసమన్నారు. పవిత్ర దివ్య ఖురాన్ అవతరించిన ఈ మాసంలో ముస్లిం మైనారిటీ సోదర,సోదరీమణులంతా నెలరోజుల పాటు కఠోర ఉపవాస దీక్షతో నిష్ఠగా అల్లా ను ఆరాధిస్తూ ఆధ్యాత్మిక జీవనం కొనసాగించడం అల్లా రక్షణ, కరుణ పొందాలనే లక్ష్యంతో రంజాన్ మాసంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తూ, బీద, ధనిక అనే తారతమ్యం లేకుండా ప్రతి ఒక్కరూ ఉన్నదానిలో ఎంతోకొంత దానధర్మాలు చేస్తూ సేవా దృక్పథానికి, సహనానికి ప్రతీకగా ఈ రంజాన్ పండుగను జరుపుకుంటారని ఎస్ఐ నాగ మధు పేర్కొన్నారు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలని సూచించారు.

## ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి సభ్యునిగా తగ్గుపర్తి చందు

**బెళగుప్ప (తెలుగోడు), మార్చి 18 :**
విశాఖపట్నంలో జరిగిన ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి సమావేశాలలో బెళుగుప్ప మండలానికి చెందిన విద్యార్థి సంఘం నాయకులు తగ్గుపర్తి చందుని రాష్ట్ర సమితి సభ్యునిగా ఎన్నుకున్నారు.



ఈ సందర్భంగా తగ్గుపర్తి చందు మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి నా ఎన్నికకు సహకరించిన ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకత్వానికి, అనంతపురం జిల్లా ప్రధాన కార్యదర్శి కుళ్లాయి స్వామి కి మరియు జిల్లా నాయకత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రానున్న కాలంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై సమరశీల పోరాటాలకు శ్రీకారం చుడతామని పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికై పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. ప్రైవేట్ కార్పొరేట్ ఫీజుల దోపిడీకి వ్యతిరేకంగా మరియు కూటమి ప్రభుత్వం విద్యార్థులకు యువకులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని దశలవారీగా ఉద్యమాలు చేపడతామని పేర్కొన్నారు.

## శ్రీ రామునికి ప్రత్యేక పూజలు

**కనేకల్ (తెలుగోడు), మార్చి 18 :**
యాడికి మండల కేంద్రంలోని శ్రీరామ స్వామి వీధిలో వెలిసిన శ్రీ రామునికి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. నేడు అనగా గురువారం ఉగాది పర్వదినం సందర్భంగా స్వామివారికి కళ్యాణం జరుగుతుంది తరువాత స్వామి వారు గజ వాహనంపై యాడికి పురవీధులకుండా ఊరేగింపు నిర్వహిస్తారని ఆలయ పెద్దలు తెలిపారు.



శ్రీరాముని ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహిస్తున్న దృశ్యం



ఆలయం వద్ద భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించిన దృశ్యం



గ్యాస్ కోసం గోడెన్ వద్ద క్యూ కట్టిన ప్రజలు.

### గ్యాస్ కోసం పడిగాపులు వార్తకు స్పందన..

# ఇండేన్ గ్యాస్ గోడౌన్‌లో తనిఖీలు

### డిఎస్ఓ వెంకటేశులు..

**యాడికి (తెలుగోడు), మార్చి 18 :**
ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ వద్ద ప్రజలు గ్యాస్ కోసం పడిగాపులు కాస్తున్నారని మంగళవారం ఈనాటి తెలుగోడు దినపత్రికలో వచ్చిన వార్తకు స్పందన లభించింది. యాడికి మండలంలో గ్యాస్ సమస్య తీవ్రంగా ఉందని పత్రికలో వార్త రావడంతతో బుధవారం జిల్లా డీఎస్ఓ వెంకటేశులు. డిటి శ్రీనివాసులు. సిఎస్‌డిటి మల్లేష్. సీఐ శ్రీనివాసులు. ఆర్ఐ కిష్టప్ప. ఏఎస్ఐ వెంకటేష్. వీఆర్వోలు. కుమారస్వామి గ్యాస్ గోడౌన్ వద్ద తనిఖీ చేశారు. గ్యాస్ కోసం వచ్చిన ప్రజలను వినియోగంపై విచారించారు.
వేములపాడు రోడ్డులో ఉన్న ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ గోడౌన్ వద్ద బుధవారం తెల్లవారుజామున నుండే ప్రజలు ఖాళీ సిలిండర్లతో క్యూ కట్టారు. అధికారులు ఆన్లైన్లో ద్వారా బుక్ చేసుకున్న వారి వివరాలను పరిశీలించి బుధవారం 360 మందికి సిలిండర్లు పంపిణీ చేయించారు. అయితే ( చాలా మంది క్యూలో ఉండడంతో పరిశీలించి ఈనెల ఐదవ తేదీ, పదో తేదీ వరకు పెండింగ్ ఉన్న వారికి, అలాగే 10 నుండి 15వ తేదీ వరకు ఆన్లైన్లో గ్యాస్ బుక్ చేసుకున్నవారికి సిలిండర్లు అందించారు. 16 నుండి 18 వరకు గ్యాస్ బుకింగ్ చేసుకునన్న వారికి గ్యాస్ ఇంటి వద్దకే డెలివరీ చేస్తారని, ప్రజలు ఎవరూ గోడౌన్ వద్దకు రావద్దంటూ అధికారులు, గ్యాస్ ఏజెన్సీ యజమాని నాగరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా డీఎస్ఓ వెంకటేశులు. డిటి శ్రీనివాసులు. సి ఎస్ డి టి మల్లేష్. సీఐ శ్రీనివాసులు. ఆర్ ఐ కిష్టప్ప. ఏఎస్ఐ వెంకటేష్. వీఆర్వోలు. కుమారస్వామి. తదితరులు పాల్గొన్నారు



గ్యాస్ కోసం గోడెన్ వద్ద క్యూ కట్టిన ప్రజలు.



గ్యాస్ ఏజెన్సీలోని కంప్యూటర్‌ను తనిఖీ చేస్తున్న డీఎస్ఓ వెంకటేశులు

# చిక్కేపల్లి అంగన్వాడీ కేంద్రం టీచర్‌పై విచారణ

### సిడిపిఓ సాజిదా బేగం..

**యాడికి (తెలుగోడు), మార్చి 18 :**
యాడికి మండల పరిధిలోని సి చికెపల్లి గ్రామం అంగన్వాడి కేంద్రంలో టీచర్ వ్యవహార శైలిపై సిడిపిఓ సాజిదా బేగం బుధవారం విచారణ జరిపారు. గత నెల అంగన్వాడి కేంద్రంలో తన కూతురు లాహిరికి వాతలు పెట్టారని తల్లి వనిజ అంగన్వాడి టీచర్‌పై ఫిర్యాదు చేయడంతో బుధవారం తాడిపత్రి నుండి సిడిపిఓ సాజిదా బేగం, సూపర్వైజర్ విజయ్ కుమారి గ్రామానికి చేరుకుని ఘటనపై విచారించారు. ముందుగా అంగన్వాడి కేంద్రంలోని టీచర్ లోకేశ్వరితోపాటు అంగన్వాడి కేంద్రంలోని పిల్లల తల్లిదండ్రులు, చుట్టుపక్కల వారిని విచారించారు. టీచరు ఎప్పుడూ తమ పిల్లలకును కొట్టలేదని, వాతలు పెట్టలేదని రాతపూర్వగా రాసిచ్చారు. అనంతరం చిన్నారి లాహిరి ఇంటి వద్దకు వెళ్లి చిన్నారిని విచారించారు. అలాగే చుట్టుపక్కల వారిని విచారించారు. అంగన్వాడి టీచర్ భర్త, మరికొందరు తమపై దాడి చేశారని ఫిర్యాదు చేయడంతో చుట్టుపక్కల వారిని విచారించగా ఎక్కువ శాతం మంది తాము చూడలేదని రాతపూర్వక ం రాసిచ్చారని వారు తెలిపారు.



చిక్కేపల్లి అంగన్వాడీ కేంద్రంలో చిన్నారి లాహిరి, తల్లిని విచారిస్తున్న సిడిపిఓ సాజిదా బేగం



అంగన్వాడి కేంద్రం టీచర్, పిల్లల తల్లులను విచారిస్తున్న సిడిపిఓ సాజిదా బేగం



బెళుగుప్పలో ఈదురు గాలులు అకాల వర్షానికి నేలకొరిగిన రైతులు నవీన్,ప్రవీణ్ సాగు చేసిన అరటి పంట

# ఈదురు గాలులు అకాల వర్షానికి దెబ్బతిన్న పంటలు

### నేలకొరిగిన మొక్కజొన్న అరటి పంటలు.. లక్షల్లో పంట నష్టం.. ప్రభుత్వం ఆదుకోవాలంటున్న బాధిత రైతులు..

**బెళగుప్ప (తెలుగోడు), మార్చి 18 :**
బలమైన ఈదురుగాలు, అకాల వర్షానికి బెళుగుప్ప మండల పరిధిలోని వివిధ గ్రామాలలో రైతులు సాగుచేసిన మొక్కజొన్న, అరటి తదితర పంటలు పూర్తిగా నేలకొరిగి లక్షల్లో పంట నష్టం వాటిల్లింది. రైతులు కంటికి రెప్పలా కాపాడుకుంటూ వస్తున్న పంట చేతికొచ్చే సమయానికి గాలివానకు నేలకూలడంతో రైతుల యొక్క బాధలు వర్ణనాతీతం. తమను ప్రభుత్వమే ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు
వివరాల్లోకి వెళితే మంగళవారం రాత్రి వీచిన బలమైన గాలులకు, అకాలంగ కురిసిన వర్షానికి మండల కేంద్రమైన బెళుగుప్ప కు చెందిన రైతులు నవీన్, ప్రవీణ్ కు చెందిన నాలుగు ఎకరాల్లో సాగు చేసిన అరటిపంట చేతికొచ్చే సమయానికి గెలతో ఉన్న పంట పూర్తిగా నేలకు ఒరిగింది. జీడిపల్లి గ్రామంలో వివిధ రైతులకు చెందిన సుమారు యాభై ఎకరాల్లో మొక్కజొన్న పంట పూర్తిగా పడిపోయింది. గంగవరం గ్రామానికి



చెందిన రాము, రాజశేఖర్ తో పాటు మరికొంతమంది రైతులకు చెందిన మొక్కజొన్న పంటలు ఈదురు గాలులకు నెలకొరిగాయి. రైతులు లక్షలాది రూపాయలు అప్పులు చేసి పంటలు సాగు చేస్తే, ఇలా బలమైన ఈదురు గాలులకు, అకాల వర్షానికి పంటలు దెబ్బ తినడంతో చేతికొచ్చే పంట దెబ్బతినడంతో తాము తీవ్రంగా నష్టపోయిన అన్ని బాధిత రైతులు పేర్కొంటున్నారు. ప్రభుత్వము తమకు నష్టపరిహారం అందించాలని బాధిత రైతులు కోరుతున్నారు.



బెళుగుప్పలో బలమైన ఈదురు గాలులు అకాల వర్షానికి దెబ్బతిన్న మొక్కజొన్న పంట



## నవోదయ ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థి స్నితిక్

**కనేకల్ (తెలుగోడు), మార్చి 18 :**
నవోదయలో ఆరో తరగతి ప్రవేశానికి నిర్వహించిన పరీక్షల్లో స్నితిక్ మంచి ప్రతిభ కనబరిచారు. డిసెంబర్‌లో జరిగిన ప్రవేశ పరీక్షల్లో కణేకల్ మండలం అంబాపురానికి చెందిన స్నితిక్ 41వ ర్యాంక్ సాధించాడు. తండ్రి గొల్ల రామకృష్ణ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. తల్లి లక్ష్మి ఇంటి పనులు చేసుకుంటూ కుమారుడిని చదివిస్తున్నారు. స్నితిక్ కణేకల్ మండలం అంబాపురం ప్రాథమిక పాఠశాలలో ఐదవ తరగతి చదువుతున్నాడు. కొడుకు చదువు పట్ల శ్రద్ద చూసి తల్లిదండ్రులు ప్రోత్సహించి నవోదయ పరీక్షలు రాయించారు. దీంతో స్నితిక్ 41వ ర్యాంక్ సాధించి నవోదయ లో సీటు సంపాదించాడు. విద్యార్థిని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందిచారు.



నవోదయలో సీటు సాధించిన ఇషానా రెడ్డి, ఆమె తండ్రిని సన్మానిస్తున్న విజన్ పాఠశాల యజమానం విశ్వనాథ్, సభ్యులు

## నవోదయ లో సీటు సాధించిన విజన్ విద్యార్థిని ఇషానా రెడ్డి

**యాడికి (తెలుగోడు), మార్చి 18 :**
జవహర్ నవోదయ విద్యాలయ సమితి నిర్వహించిన ఆరవ తరగతి ప్రవేశ పరీక్షలో యాడికి పట్టణానికి చెందిన గంగశేఖర్ రెడ్డి కుమార్తె ఇషానా రెడ్డి 93.75 మార్కులతో అడ్మిషన్ పొందాడు. ఈ సందర్భంగా ఇశానారెడ్డిని విజన్ విద్యాసంస్థల కరస్పాండెంట్ విశ్వనాథ్ అభినందించారు. తమ కుమార్తెను ప్రోత్సహించిన గంగ శేఖర్ రెడ్డి ని సన్మానించారు.. నవోదయ ప్రవేశ పరీక్షలో దాదాపు పది మంది విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించినప్పటికీ సీట్లు తక్కువగా ఉన్నందున అడ్మిషన్ పొందలేకపోయానని పాఠశాల యాజమాన్యం తెలిపింది. ఈ కార్యక్రమంలో విజన్ ఉపాధ్యాయ బృందం అమర్, శేఖర్, కోట, విజన్ విద్యార్థులు పాల్గొన్నారు.

## శివ బాలయోగి మహరాజ్ ఆశ్రమంలో నేటి నుండి వసంత నవరాత్రులు

**అనంతపురం కల్చరల్ (తెలుగోడు), మార్చి 18 :**
శ్రీ శివ బాలయోగి మహరాజ్ ఆశ్రమం శ్రీ అనంతేశ్వరీ,శ్రీ అనంతేశ్వర స్వామి దేవస్థానంలో ఈనెల 19 నుండి 27 వరకు వసంత నవరాత్రులు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వసంత నవరాత్రుల సందర్భంగా 19వ తేదీ 27 వరకు మహిళా మండలి ఆధ్వర్యంలో ప్రతి రోజు సాయంత్రం 6 గంటల నుంచి( గణపతి ప్రార్థన, గురు ప్రార్థన, సరస్వతి దేవి ప్రార్థన, గౌరీ దేవి ప్రార్థన, మణిద్వీప వర్ణన, శ్రీరామ నామాలు, హనుమాన్ చాలీసా, గోవింద నామాలు , సౌందర్యలహరి పారాయణం వుంటాయన్నారు. మహా మంగళహారతి, అనంతరం తీర్థ ప్రసాద వితరణ వుంటుదన్నారు.



పదవ తరగతి పబ్లిక్ పరీక్ష కేంద్రాలను తనిఖీ చేస్తున్న తహసిల్దార్ బ్రహ్మయ్య

## 10వ తరగతి పరీక్ష కేంద్రాల తనిఖీ

*తహసీల్దార్ బ్రహ్మయ్య ..*

**కనేకల్ (తెలుగోడు), మార్చి 18 :**
కణేకల్లు గ్రామంలో నిర్వహిస్తున్న 10వ తరగతి పబ్లిక్ పరీక్ష నాలుగు కేంద్రాలను తహశీల్దార్ బ్రహ్మయ్య బుధవారం తనిఖీ చేశారు పరీక్షల నిర్వహణ సజావుగా జరుగుతుందో లేదో ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పరీక్షా కేంద్రాల్లో మౌలిక సదుపాయాలపై ప్రత్యేకంగా దృష్టి సారించిన తహశీల్దార్, పరీక్షలు జరుగుతున్న సమయంలో తాగునీరు మరియు నిరంతర కరెంట్ సరఫరా ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. అలాగే విద్యార్థులకు ఏవైనా అనారోగ్య సమస్యలు తలెత్తినపుడు వెంటనే చికిత్స అందించేందుకు మెడికల్ సిబ్బంది సిద్ధంగా ఉండాలని సూచించారు.పరీక్షల నిర్వహణలో ఎటువంటి అంతరాయం కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, విధుల్లో ఉన్న సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆయన స్పష్టం చేశారు.



## అఖిలభారత బంజార సేవా సంఘం రాష్ట్ర యువత కార్యదర్శిగా బాలాజీ నాయక్

**అమరాపురం (తెలుగోడు), మార్చి 18 :**
అమరాపురం మండలం ఆరోహణపల్లి గ్రామానికి చెందిన బాలాజీ నాయక్ అఖిలభారత బంజార సేవా సంఘం రాష్ట్ర యువత కార్యదర్శిగా నియమించినట్లు నేషనల్ ప్రెసిడెంట్ బంజారు సేవా సంఘం బాబురావు, ఆంధ్ర ప్రదేశ్ ప్రెసిడెంట్ ఆంజనేయులు నాయక్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శివకుమార్ నాయక్, రాష్ట్ర స్టేట్ హానరబుల్ ప్రెసిడెంట్ కేశవ నాయక్, రాష్ట్ర ట్రెజరర్ ఆనంద నాయక్ కలిసి బాలాజీ నాయకును రాష్ట్ర యువక కార్యదర్శిగా నియమించినట్లు తెలిసింది. ఈ సందర్భంగా బాలాజీనాయక్ మాట్లాడుతూ బంజారా కుల అభిరుద్దికి కృషి చేస్తానని అయన తెలిపారు. ఈ సందర్భంగా మాజీ మంత్రివర్యులు నీలకంఠాపురం రఘువీరారెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధాకర్, హాలుకూరు కాంతారాజు బాలాజీనాయక్‌కు శుభాకాంక్షలు తెలిపారు.


గ్రంథాలయ రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా కార్యదర్శి కమ్మన్న

## గ్రంథాలయం తనిఖీ

**జిల్లా కార్యదర్శి కమ్మన్న..**

**బత్తలపల్లి (తెలుగోడు), మార్చి 18 :**
బత్తలపల్లి శాఖ గ్రంథాలయాన్ని గ్రంథాలయ శాఖ ఉమ్మడి జిల్లా కార్యదర్శి కమ్మన్న తనిఖీ చేశారు. బుధవారం మండల కేంద్రమైన బత్తలపల్లి లోని శాఖ గ్రంథాలయంను ఉమ్మడి జిల్లా కార్యదర్శి కమ్మన్న ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయంనకు సంబంధించిన పలు రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. బత్తలపల్లి గ్రంథాలయ సంస్థకు రావలసిన సెస్ బకాయిలను జమచేయుటకు ప్రయత్నించాలని గ్రంథాలయ అదికారి రాజేశ్వరిని ఆదేశించారు. గ్రంథాలయం నందు ఉన్న వివిధ రకాల పుస్తకాలు అందరికి అందుబాటులో ఉంచాలని సూచించారు. గ్రంథాలయంలోని నాలెడ్జి పుస్తకాలను విద్యార్థిని విద్యార్థులు పాఠకులు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిణి రాజేశ్వరి, గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు.

# పుట్టపర్తిలో దివ్యాంగ శక్తికి శ్రీకారం

### దివ్యాంగుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం.. ఎమ్మెల్యే పల్లె సింధూర .. దివ్యాంగులకు త్వరలో ఇంటి పట్టాలు.. జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్..

**పుట్టపర్తి (తెలుగోడు), మార్చి 18 :**
దివ్యాంగుల సాధికారతకు ప్రభుత్వం చేపడుతున్న చర్యల్లో భాగంగా "దివ్యాంగ శక్తి" కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. పుట్టపర్తిలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో భాగంగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆర్టీసీ బస్సులో దివ్యాంగులతో కలిసి ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రయాణిస్తూ వారి సమస్యలు, అవసరాలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. పుట్టపర్తి నుంచి కర్ణాటక నాగేపల్లి, బుక్కపట్నం, కొత్త చెరువు మార్గంగా తిరిగి పుట్టపర్తి వరకు జరిగిన ఈ ప్రయాణంలో దివ్యాంగులతో కలిసి మమేకమైన నేతలు, అధికారులు వారి అభిప్రాయాలను వినిపించుకుని తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ శ్యాంప్రసాద్ మాట్లాడుతూ దివ్యాంగులు సమాజంలో బలహీన వర్గం కాదని, సరైన అవకాశాలు కల్పిస్తే అసాధారణ ప్రతిభ కనబరుస్తారని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని విద్య, ఉపాధి రంగాల్లో ముందుకు రావాలని సూచించారు. త్వరలో దివ్యాంగులకు ఇంటి పట్టాలు అందజేస్తామని తెలిపారు.


దివ్యాంగులతో కలిసి బస్సులో ప్రయాణిస్తున్న ఎమ్మెల్యే పల్లె సింధూర, జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్


దివ్యాంగులతో కలిసి బస్సులో ప్రయాణిస్తున్న ఎమ్మెల్యే పల్లె సింధూర, జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్

ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రతి నెల రూ.6 వేల పెన్షన్ అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించినట్లే దివ్యాంగులకు కూడా "దివ్యాంగ శక్తి" ద్వారా ఉచిత ప్రయాణ సదుపాయం కల్పిస్తున్నామని చెప్పారు. జిల్లాలో ఉన్న దివ్యాంగులలో వేలాది మందికి ఈ పథకం ప్రయోజనం చేకూరుతోందన్నారు.
మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ దివ్యాంగుల కోసం ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టడం సమాజ అభివృద్ధికి కీలకమని అన్నారు. వారికి సమాన అవకాశాలు కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు, సామాజిక సమానత్వం పెంపొందించడమే లక్ష్యమని అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ ప్రాంతీయ మేనేజర్ మధుసూదన్, డీఎం ఇనతుల్లా, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, దివ్యాంగుల రాష్ట్ర మీడియా సమన్వయకర్త గోగుల చక్రపాణి, గంగాధర్ నాయుడు, సురేష్ చౌదరి, కృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## తారుమారైన ఉగాది రుచులు..

వేపచెట్ల వాకిళ్లలో
వసంతం అడుగుపెట్టాల్సిన వేళ
కొమ్మలన్నీ నిశ్శబ్దంగా నిలబడి
పూల జాడకోసం ఎదురుచూస్తున్నాయి...

ఎప్పుడో ప్రతి ఇంటి ముంగిట
పరిమళాల పండుగగా రాలిన
వేపపూల జల్లు
ఈసారి కాలం గాలిలో కలిసిపోయింది....

మామిడి తోటల గుండెల్లో
పసిపిందెల నవ్వులు పూయాలి గానీ...
చిగురుల ఊపిరే ఆగిపోయినట్టు
పిందెలు నేలమీద
నిశ్శబ్దంగా పడిపోతున్నాయి...


ప్రకృతి పాఠశాలలో
ఋతువుల అక్షరాలు చెదిరిపోతే
వసంతం పాఠం కూడా
ఇప్పుడు తడబడుతోంది....

ఉగాది పచ్చడిలో ఉండాల్సిన
ఆరు రుచుల సమ్మేళనం
ఈసారి అయోమయంలో నిలబడి
కాలం కదలికను ప్రశ్నిస్తోంది...

చేదు కనిపించదు
తీపి తడబడుతోంది
పులుపు పరాయి అయింది
కారం కరిగిపోయింది
వగరు వాడిపోయింది
ఉప్పు మాత్రం మనసు నొప్పిలా మిగిలింది....

వేపపూలు లేని పచ్చడిలో
వసంతం రుచిలేని కథగా మారితే,
ప్రకృతి మనకిచ్చిన హెచ్చరికను
కాలం మెల్లగా వినిపిస్తోంది....

మన చేతులే మార్చిన మార్గాల్లో
ప్రకృతి నడక తడబడితే
ఉగాది కూడా అడుగుతోంది ...
"ఓ..మనిషీ...
నా రుచులు తిరిగి తెచ్చేది ఎప్పుడు?"



– బాబ్‌జాన్..


రైతన్న మీకోసం కార్యక్రమంను వివరిస్తున్న అధికారులు

# అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం

### మహిళ భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణపై దృష్టి.. జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ..

**నల్లమాడ (తెలుగోడు), మార్చి 18 :**
పుట్టపర్తి సబ్‌డివిజన్ పరిధిలోని నల్లమాడ సర్కిల్‌లో పోలీస్ స్టేషన్ల వార్షిక తనిఖీ సందర్భంగా జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ పలు కీలక సూచనలు చేశారు. నల్లమాడ, ఆమడగూరు పోలీస్ స్టేషన్లను సందర్శించి, స్టేషన్ నిర్వహణ, రికార్డుల సంరక్షణ, పెండింగ్ కేసులు, ఎన్‌డీపీఎస్ కేసులపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. మహిళల నుంచి వచ్చే ఫిర్యాదులను అత్యంత ప్రాధాన్యతతో స్వీకరించి వెంటనే పరిష్కరించాలని, ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. రౌడీ షీటర్లు, పాత నేరస్తుల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచాలని, విజిబుల్ పోలీసింగ్ పెంచి రాత్రి గస్తీలను బలోపేతం చేయాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, స్టేషన్లలో పట్టుబడిన వాహనాల కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. అక్రమ మద్యం, ఇసుక రవాణా, పేకాట, క్రికెట్ బెట్టింగ్, కోడి పందాలు వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలను కట్టడి చేయాలని ఆదేశించారు.
ఫ్యాక్షన్ ప్రభావిత గ్రామాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని, డ్రోన్ సాయంతో పర్యవేక్షణను బలోపేతం చేయాలని తెలిపారు. బాల్య వివాహాలు, గంజాయి వినియోగం, సైబర్ మోసాలు, పోక్సో కేసులు, కొత్త చట్టాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. అవినీతికి తావులేకుండా నిబద్ధతతో పనిచేయాలని, సిబ్బంది సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. ఈ తనిఖీలో డీఎస్పీ విజయ్ కుమార్, సీసీ చిరంజీవి, సీఐ శ్రీనివాసులు, ఎస్సైలు ప్రదీప్, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


నల్లమాడ సర్కిల్ కార్యాలయంలో ఫైళ్లను తనిఖీ చేస్తున్న జిల్లా ఎస్పీ సతీష్ కుమార్


పోలీసుల గౌరవవందనం స్వీకరిస్తున్న జిల్లా ఎస్పీ సతీష్ కుమార్

## ఆధునిక సాంకేతికతో సాగులో లాభాలు

### మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా పంటల ఎంపిక కీలకం నీటి పొదుపు, అగ్రిటెక్‌తో దిగుబడులు పెంపు.. ఏడిఏ లక్ష్మనాయక్..

**బత్తలపల్లి (తెలుగోడు), మార్చి 18 :**
వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలంటే ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ, మార్కెట్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని పంటల సాగు చేయడం అత్యంత అవసరమని ధర్మవరం వ్యవసాయ సహాయ సంచాలకులు లక్ష్మనాయక్ అన్నారు. బుధవారం మండలంలోని లింగారెడ్డిపల్లి గ్రామంలో నిర్వహించిన రైతన్న మీకోసం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయి రైతన్నలకు పలు సూచనలు చేశారు. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలను ముందుగానే గుర్తించి సాగు చేస్తే రైతులకు మంచి లాభాలు వస్తాయని ఆయన వివరించారు. నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించడం ద్వారా ఖర్చులను తగ్గించుకోవచ్చని, డ్రిప్, స్ప్రింక్లర్ వంటి ఆధునిక పద్ధతులు ఉపయోగించాల్సిన అవసరం ఉందన్నారు. అగ్రిటెక్ వినియోగం వల్ల వ్యవసాయ పనులు వేగవంతం అవడంతో పాటు దిగుబడులు కూడా పెరుగుతాయని తెలిపారు. పంటలను నేరుగా విక్రయించకుండా ప్రాసెసింగ్ చేసి విలువ ఆధారిత ఉత్పత్తులుగా మార్చితే అదనపు ఆదాయం పొందవచ్చని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న కనీస మద్దతు ధరలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ముఖ్యమంత్రి ప్రతిపాదించిన పంచ సూత్రాలు రైతుల అభివృద్ధికి దోహదపడతాయని తెలిపారు. ఈ సందర్భంగా సిరికల్చర్ ఇంచార్జ్ ఏడీ రాజేశ్వరి మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, రాయితీలను రైతులు పూర్తిగా వినియోగించుకుని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాలపై కూడా దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఓబిరెడ్డి, విస్తరణ అధికారి శ్రీనివాసులు, గ్రామ వ్యవసాయ సహాయకులు శ్రీచరిత్, సెరికల్చర్ టెక్నికల్ అసిస్టెంట్ లక్ష్మణ్, రైతులు పాల్గొన్నారు.

## కన్నీళ్లు తుడుచుకుని.. తండ్రి ఆశయం కోసం పరీక్షకు

**బత్తలపల్లి (తెలుగోడు), మార్చి 18 :**
గుండె నిండా తండ్రి మరణించిన విషాదం... కళ్లలో ఆగని కన్నీళ్లు... అయినా ఆ విద్యార్థి వెనుకడుగు వేయలేదు. తన తండ్రి కలలను నిజం చేయడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని భావించి, పుట్టెడు దుఃఖాన్ని అధిగమించి పరీక్షా కేంద్రానికి హాజరయ్యాడు. బత్తలపల్లి మండలం గంటాపురం గ్రామానికి చెందిన అక్కిం రెడ్డప్ప ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. అదే రోజు పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రారంభమయ్యాయి. తన తండ్రి రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్సలు పొందుతుండడంతో దుఃఖంలోనూ పరీక్ష రాసేందుకు వెళ్ళాడు. తర్వాత తండ్రి మరణ వార్త తెలుసుకున్న కుమారుడు సిద్ధార్థ తీవ్ర భావోద్వేగానికి లోనై భోరున విలపించాడు. మంగళవారం అంత్యక్రియలు పూర్తి చేసిన అనంతరం, బుధవారం జరిగిన పరీక్షకు హాజరై తన పట్టుదలను చాటుకున్నాడు. బాగా చదివి మా నాన్న ఆశయాన్ని నెరవేర్చుతా అని కన్నీళ్లతో చెప్పిన సిద్ధార్థ మాటలు అక్కడున్న వారందరినీ కలచివేశాయి.


పరీక్ష రాసేందుకు బాలికల ఉన్నత పాఠశాలకు చేరుకున్న అక్కిం సిద్ధార్థ

# పరమటివీరన్నకు భారీగా తరలిన పన్నారపు బండ్లు

### ఉగాది సందర్భంగా భక్తుల రద్దీ.. పశువుల క్షేమం కోసం ప్రత్యేక మొక్కులు.. మండలం నలుమూలల నుంచి భక్తుల రాక..

**బత్తలపల్లి (తెలుగోడు), మార్చి 18 :**
మూగజీవాల పట్ల కరుణ చూపే ఆరాధ్యదైవంగా పేరుగాంచిన పరమటివీరన్నకు ఉగాది పండుగను పురస్కరించుకొని బుధవారం భక్తులు భారీగా తరలివెళ్లారు. మండలం నుంచి పశువులు, పన్నారపు బండ్లు పెద్దఎత్తున తీసుకువెళ్లడం కనిపించింది. తాడిమర్రి మండలం ఆత్మకూరు గ్రామ సమీపంలో వెలసిన పరమటివీరన్నకు మొక్కుకుంటే పశువులకు ఎటువంటి కీడు జరగదన్నది ప్రజల గాఢ విశ్వాసం. దీనిని అనుసరించే రైతులు తమ ఆవులు, గేదెలు ప్రసవించిన తర్వాత మొదటగా స్వామివారికి పాలను సమర్పించడం ఆనవాయితీగా కొనసాగుతోంది. గ్రామాల్లో పోట్లాటలు, దొంగతనాలు జరిగినప్పుడు పరమటివీరన్న చెంత ప్రమాణం చేయిస్తే నిజాలు వెలుగులోకి వస్తాయన్న నమ్మకం కూడా ప్రజల్లో బలంగా ఉంది. మండలం మాత్రమే కాకుండా జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలివస్తుండటం విశేషం. ఇటీవలి కాలం వరకు పరమటివీరన్న దర్శనానికి పురుషులే వెళ్లడం ఆనవాయితీగా ఉండేది. మహిళలు ప్రసాదాన్ని కూడా ముట్టుకోరని భావన ఉండేది. అయితే ప్రస్తుత కాలంలో మహిళలు కూడా దర్శనానికి వెళ్లడం కనిపిస్తోంది. ఉగాది పండుగ ముందు రోజు మండలం తోపాటు ముదిగుబ్బ, తాడిమర్రి, ధర్మవరం, అనంతపురం ప్రాంతాల నుంచి రైతులు పన్నారపు బండ్లు, పశువులు, ట్రాక్టర్లను అందంగా అలంకరించుకొని తరలివెళ్లారు. మరికొందరు వాహనాల్లో వెళ్లి భక్తితో ప్రదక్షిణలు చేయడం పరిపాటిగా కొనసాగుతోంది. ప్రతి ఇంటి నుంచి బియ్యం, బేడలు, బెల్లం తీసుకువెళ్లి భక్తులు సమర్పించడం ఆనవాయితీ. ఈ విధంగా సమర్పించిన ధాన్యాన్ని బస్తాలుగా పోగుచేసి, ఉగాది అనంతరం చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు అన్నదానం నిర్వహించడం ప్రత్యేకతగా నిలుస్తోంది.


పూజలు అందుకుంటున్న శ్రీ పదమటి వీరన్న స్వామి

## శ్రీ సరస్వతీ విద్యామందిరంలో ముందస్తు ఉగాది సంబరాలు

### ప్రధానోపాధ్యాయుడు మురళీకృష్ణ ..

**అమరాపురం (తెలుగోడు), మార్చి 18 :**
అమరాపురంలోని శ్రీ సరస్వతి విద్యా మందిరంలో బుధవారం ముందస్తు ఉగాది సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానాచార్యులు మురళీకృష్ణ మాట్లాడుతూ ఉగాది ప్రాధాన్యతను తెలియజేశారు. అనంతరం పోషకులకు ఉగాది నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

**పరాభవ నామ సంవత్సరం ఆధ్యాత్మిక అంతరార్థం..**
మనిషిలో ఉన్న అహంకారం"గర్వం' 'స్వార్థం' పరాభవం పాలు కావడాన్న (ఓడిపోవడాన్ని) ఇది సూచిస్తుంది. మనలోని కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలు అనే అరిషడ్వర్గాలను జయించి, వినయంతో ఉండాలని ఈ సంవత్సరం మనకు బోధిస్తుంది. అహంకారంతో విర్రవీగే పాలకులకు,వ్యక్తులకు ఈ సంవత్సరం గట్టి గుణపాఠం నేర్పుతుంది. కానీ వినయంతో, నిజాయితీగా, ధర్మబద్ధంగా కష్టపడే వారికి అద్భుతమైన విజయాలను సాధించవచ్చని ప్రధానోపాధ్యాయుడు మురళీకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ఉగాది పచ్చడి అందిస్తున్న విద్యార్థులు


సరస్వతీ పూజలో పాల్గొన్న చిన్నారులు.


సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న చార్వీకారాజ్ బృందం .


శ్రీ పదమటి వీరన్నకు మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు.


ట్రాక్టర్లను అందంగా ముస్తాబు చేసి స్వామికి ప్రదక్షిణలు చేస్తున్న దృశ్యం




తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ఉపాధ్యాయులు

# ఉపాధ్యాయుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

**బీటీఏ నేతల హెచ్చరిక**

**పెద్దకడబూరు (తెలుగోడు), మార్చి 18 :**
ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని బీటీఏ జిల్లా అధ్యక్షులు భాస్కర్ డిమాండ్ చేశారు. బుధవారం ఆదోని పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీటీఏ జిల్లా అధ్యక్షుడు భాస్కర్ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు తక్షణమే 30 శాతం మధ్యంతర ఉపశమనం ప్రకటించి, కొత్త వేతన సవరణ కోసం పీఆర్సీ కమిటీని నియమించాలని ప్రభుత్వాన్ని కోరారు. బీటీఏ సీనియర్ నాయకులు జయరాం మాట్లాడుతూ అధికారంలోకి రాకముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే 2010కు ముందు నియామకం పొందిన ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలన్నారు. పెన్షన్ బకాయిల చెల్లింపులపై స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఇప్పటికైనా పాలకులు మేల్కొని ఉపాధ్యాయుల సమస్యలపై దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రభుదాస్, రవి, లక్ష్మన్న, కేశన్న, నవీన్, రామకృష్ణ, చిరంజీవి, రాము, రామస్వామి, నాగరాజు, ఈశ్వరయ్య, రామన్న, మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.




డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్‌కు అందజేస్తున్న ఉపాధ్యాయులు

# ప్రతిభ హైస్కూల్‌లో ఉగాది, రంజాన్ సంబరాలు

**కరస్పాండెంట్ సయ్యద్ దూద్ బాషా..**

**కౌతాళం (తెలుగోడు), మార్చి 18 :**
కౌతాళం మండల కేంద్రంలోని ప్రతిభ హైస్కూల్‌లో బుధవారం ముందస్తు ఉగాది, రంజాన్ పండుగ సంబరాలను విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. రెండు రోజులు పండుగలకు సెలవు దినం కావడంతో ముందస్తుగా పాఠశాలలో ఉగాది, రంజాన్ పండుగలా సంబరాలు నిర్వహించినట్లు కరస్పాండెంట్ సయ్యద్ దూద్ బాషా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని తొమ్మిదో తరగతి విద్యార్థి సిద్ద లింగయ్య స్వామి పంచాంగ శ్రవణం గావించారన్నారు. అనంతరం విద్యార్థినిలు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు చాలా చక్కగా ఆకట్టుకున్నాయి. రంజాన్ పండుగను పురస్కరించుకొని విద్యార్థినీ విద్యార్థులు నాథ్( అల్లా కవితలు ) చక్కగా పాడి వినిపించారు. అనంతరం హిందూ ముస్లిం విద్యార్థినీ విద్యార్థులు అలింగనం చేసుకొని, ఉగాది, రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.. విద్యార్థుల్లో విద్యార్థి దశ నుంచే మానవత్వపు విలువలు తెలుసుకునే లాగా ఈ పండుగలను చేస్తారని ప్రతి ఒక్క మనిషి కులమతాలకు అతీతంగా మానవత విలువలను కలిగి సమాజంలో సుఖ సంతోషాలతో శాంతియుత వాతావరణంలో జీవించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జ్ఞానేశ్వరి, సెక్రటరీ మైనుద్దీన్, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.







పంచాంగ శ్రవణం నిర్వహిస్తున్న విద్యార్థులు.
ఈద్ ముబారక్ తెలుపుకుంటున్న చిన్నారులు

# జిల్లా ప్రజలందరికీ శ్రీ పరాభవ నామ తెలుగు సంవత్సర ఉగాది శుభాకాంక్షలు

**బెళుగుప్ప (తెలుగోడు), మార్చి 18 :**
జిల్లాలోని ప్రజలందరికీ శ్రీ పరాభవ నామ తెలుగు సంవత్సర ఉగాది పండుగ శుభాకాంక్షలను జిల్లా ఇంచార్జి మంత్రి మరియు పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక మరియు శాసన సభ వ్యవహారాల శాఖామాత్యులు పయ్యావుల కేశవ్, జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, జిల్లా ఎస్పీ పి.జగదీష్, పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ, శాసన మండలి సభ్యులు, ఎంఎల్ఏ లు, జేసి సి.విష్ణుచరణ్, డిఆర్ఓ మలోల, తదితరులు తెలిపారు. తెలుగువారు జరుపుకునే ఈ ఉగాది పండుగను మనం తెలుగు సంవత్సరాదిగా సాంప్రదాయ బద్ధంగా జరుపుకుంటామని, సహృద్భావ వాతావరణంలో ప్రజలందరూ జరుపుకోవాలని తెలిపారు. ఉగాది పచ్చడిని ఆరు రుచుల (తీపి, పులుపు, వగరు, కారం, చేదు, ఉప్పు) సమ్మేళనంతో తయారుచేసే ఈ ప్రసాదం ఎంతో విశిష్టమైనది అని అన్నారు. తెలుగు సంవత్సరాది ప్రారంభం నుండి ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో పాడి పంటలతో సిరి సంపదలతో తుల తూగాలని, వారికి అంతా మంచే జరగాలని వారు ఆకాంక్షించారు.



జిల్లా ఇంచార్జి మంత్రి టీజీ భరత్, మంత్రి పయ్యావుల కేశవ్ జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్, జిల్లా ఎస్పీ జగదీష్

# రైతులకు అండగా కూటమి ప్రభుత్వం

**అన్నదాత సుఖీభవ పథకంపై రైతులకు అవగాహన ..**

**పెద్దకడబూరు (తెలుగోడు), మార్చి 18 :**
రైతుల ఆర్థిక స్థిరత్వం, సాగు ఖర్చుల భారం తగ్గింపు లక్ష్యంగా పీఎం కిసాన్ – అన్నదాత సుఖీభవ పథకాన్ని కూటమి ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేస్తోందని టీడీపీ మండల అధ్యక్షులు గవిగట్టు మల్లికార్జున, సొసైటీ చైర్మన్ తలారి మీ సేవ ఆంజనేయులు, సొసైటీ డైరెక్టర్లు గోనుమాను నరసన్న, హనుమేష్, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి మొట్రు రామాంజనేయులు, బూత్ యూనిట్ ఇన్ చార్జ్ తలారి అంజీ, జాలవాడి గ్రామ అధ్యక్షులు బోయ యంకన్న స్పష్టం చేశారు. బుధవారం మంత్రాలయం టీడీపీ ఇన్ చార్జ్ రాఘవేంద్ర రెడ్డి, రైతు రైతు విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంతరెడ్డి ఆదేశాల మేరకు పెద్దకడబూరు మండల పరిధిలోని బసలదొడ్డి, జాలవాడి, పెద్దకడబూరు గ్రామాలలో రైతన్న కోసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల వారీగా రైతులను కలుసుకుని పథకం అమలు విధానం, అర్హతలు, అందుతున్న లబ్ధులను వివరించారు. అనంతరం వారు మాట్లాడుతూ చిన్న, మధ్య తరహా రైతులకు పీఎం కిసాన్ – అన్నదాత సుఖీభవ పథకం ద్వారా లభిస్తున్న ఆర్థిక సహాయం సాగుకు ఎంతో దోహదపడుతోందని తెలిపారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం ప్రతి రైతుకు సంవత్సరానికి రూ.20 వేల పెట్టుబడి సాయాన్ని మూడు విడతలుగా నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నామని స్పష్టం చేశారు. విత్తనాలు, ఎరువులు, కార్మిక వ్యయాలు వంటి అవసరాలకు ఈ సాయం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. అలాగే రైతులు పథకానికి సంబంధించి ఎలాంటి సమస్యలు ఎదుర్కొన్నా వెంటనే అధికారులను సంప్రదించాలని, ప్రభుత్వం వారి పక్షాన నిలుస్తుందని హామీ ఇచ్చారు. వ్యవసాయం లాభదాయకంగా మారేలా ప్రభుత్వం పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోందని వివరించారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని, ప్రతి అర్హుడైన రైతు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బలోపేతం కావాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మొట్రు కుంటి ఈరన్న, దిట్టికాటి దేవేంద్ర, హనుమన్న, జాలవాడి భీమన్న, శాంతప్ప తదితరులు పాల్గొన్నారు.



రైతన్న కోసం కార్యక్రమం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు



పీఎం కిసాన్ – అన్నదాత సుఖీభవ పథకంపై అవగాహన కల్పిస్తున్న టీడీపీ నాయకులు



బసలదొడ్డిలో అన్నదాత సుఖీభవ పథకం గురించి రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం.
జాలవాడిలో రైతన్న కోసం కార్యక్రమం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

# దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభం

**ఎమ్మెల్యే డాక్టర్ బి.వీ. జయ నాగేశ్వర్ రెడ్డి ..**

**ఎమ్మిగనూరు (తెలుగోడు), మార్చి 18 :**
రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తున్న దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణం కార్యక్రమంలో భాగంగా ఎమ్మిగనూరు ఏపీఎస్ ఆర్టీసీ బస్సు స్టాండ్‌లో ఎమ్మెల్యే డాక్టర్ బీ.వీ. జయ నాగేశ్వర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టితో ఇంద్రధనస్సు కార్యక్రమంలో భాగంగా అమలు చేస్తున్న దివ్యాంగ శక్తి పథకం ద్వారా దివ్యాంగులకు సులభమైన ప్రయాణ సౌకర్యం కల్పించారని తెలిపారు. ఈ పథకం ద్వారా రాష్ట్రంలో 40 శాతం కంటే ఎక్కువ వికలాంగత కలిగిన పిడబ్ల్యుడి పాస్ హోల్డర్లు ఉచితంగా బస్సు ప్రయాణం చేయవచ్చన్నారు. గ్రామీణ ప్రాంతాలకు అనుసంధానంగా నడిచే పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, సిటీ ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్ సేవల్లో ఈ సౌకర్యం అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి దివ్యాంగులతో కలిసి బస్సులో ప్రయాణించి వారితో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమం కోసం అందిస్తున్న పథకాలు మరియు మద్దతు, పెన్షన్ల పెంపు వంటి పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కుర్ని కార్పొరేషన్ చైర్మన్, మార్కెట్ కమిటీ చైర్మన్, ౧ణూ పార్లమెంట్ వైస్ ప్రెసిడెంట్ భాస్కర్ల చంద్రశేఖర్ ఎమ్మిగనూరు దివ్యాంగులు, మండల



దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం



దివ్యాంగులతో ఎమ్మెల్యే డాక్టర్ బీ.వీ. జయ నాగేశ్వర్ రెడ్డి . ఎమ్మెల్యేను సన్మానించిన దృశ్యం




# ఇమామ్, మౌజన్లకు 45 కోట్లు విడుదల పట్ల హర్షం

**టీడీపీ మైనార్టీ నాయకులు తురేగల్ నజీర్ ..**

**ఎమ్మిగనూరు (తెలుగోడు), మార్చి 18 :**
ముస్లింల అభివృద్ధి, సంక్షేమం సీఎం చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమవుతుందని టీడీపీ మైనార్టీ నాయకులు తురేగల్ నజీర్ అన్నారు. ఇమామ్, మౌజన్లకు 45 కోట్లు విడుదల చేయడం హర్షించదగ్గ విషయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న ఇమాములకు రూ. 5 వేలు , మౌజన్లకు రూ. 10 వేలు చొప్పున గౌరవ వేతనం ఆరు నెలల బకాయిలు ఒకేసారి జమ చేయడం ఎంతో సంతోషకరమన్నారు. ముస్లింల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఇప్పటివరకు ఇమామ్, మౌజన్లకు 180 కోట్లు కూటమి ప్రభుత్వం సహాయం చేసిందని తెలిపారు. మరోపక్క హజ్ యాత్రకు ప్రభుత్వం ఆర్థిక సహాయం చేస్తుందన్నారు. నిధులు విడుదల చేయడం పట్ల సీఎం చంద్రబాబుకు, స్థానిక ఎమ్మెల్యే బీవీ. జయనాగేశ్వర రెడ్డి, మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండి ఫారుక్ లకు ఆయన ముస్లింల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బివి

# ప్రభుత్వ ఎంపీపీ పాఠశాల సందర్శన

**ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి..**

**ఎమ్మిగనూరు (తెలుగోడు), మార్చి 18 :**
ఎమ్మిగనూరు పట్టణంలోని ఎస్ఏంటి ప్రభుత్వ పాఠశాలను ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన పథకం అమలు తీరుతో పాటు పాఠశాల కార్యకలాపాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి భోజనం నాణ్యతపై ఆరా తీశారు. ఉపాధ్యాయులతో సమావేశమై మధ్నాహ్న భోజనం పథకం అమలు విధానం, ఎదురవుతున్న సమస్యలు , నిర్వహణలో ఉన్న సవాళ్లపై చర్చించారు. తన అభిప్రాయాలను ఫీడ్‌బ్యాక్ రూపంలో నమోదు చేసి సంబంధిత శాఖలకు సూచనలు పంపించారు. విద్యార్థులకు పోషకాహారం మరియు విద్యా అభివృద్ధిపై మంత్రి నారా లోకేష్ ఆదేశాలకనుగుణంగా ఈ తనిఖీ నిర్వహించినట్లు ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి తెలిపారు.



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే బివి

# అన్నదాతకు అండగా ప్రజాప్రభుత్వం

**రైతన్న మీకోసం వారోత్సవాలు..**
**అన్నదాత సుఖీభవ ఇంటింట ప్రచారం..**
**సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్..**
**ఇంచార్జి ఎన్.రాఘవేంద్ర రెడ్డి ..**

**కౌతాళం (తెలుగోడు), మార్చి 18 :**
పీఎం కిసాన్ యోజన, అన్నదాత సుఖీభవ పథకం ఇంటింటా ప్రచారంలో భాగంగా మంత్రాలయం ఇంచార్జి రాఘవేందర్ రెడ్డి లబ్ధి దారులకు సంక్షేమ అభివృద్ధి ఫలాలు, పెట్టుబడి సహాయం కింద ఏడాదికి 20వేలు కేంద్రం నుండి 6 వేలు, రాష్ట్ర ప్రభుత్వం నుండి 14 వేలు మూడు విడతలో రైతన్నలకు అందించిందని వివరించారు. సమస్యలను పరిష్కరించే విధంగా పాలన అందిస్తామని, ప్రతి హామీని ప్రజలకు చేరవేస్తూ,ప్రజలను చైతన్యం చేసే దిశగా అడుగులు వేస్తుందని, ప్రకృతి వ్యవసాయ సేద్యం వైపు ప్రతి రైతు కొనసాగి భూసార పరిరక్షణకు కాపాడి,అధిక దిగుబడి వచ్చే విధంగా సాంకేతికత తోడు చేసుకొని లాభసాటి వ్యవసాయం చెయ్యాలని అన్నారు. అన్నదాతకు అండగా కూటమి ప్రభుత్వం నదుల అనుసంధానం ద్వారా ప్రతి మనిషికి ప్రతి ఎకరాకు తాగు సాగు నీరు అందించే విధంగా మన ముఖ్యమంత్రి నారాచంద్రబాబు ప్రణాళికలు సిద్ధం చేశారని దీనికి ప్రజల సహకారం అందించాలని రాబోయే రోజుల్లో కూటమి ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు.
ఈ కార్యక్రమంలో కౌతాళం సింగిల్ విండో చైర్మన్ వెంకటపతిరాజు, బోయ మారెప్ప టిబిపి చైర్మన్ టిప్పుసుల్తాన్,అడివప్ప గౌడ్,. పట్టాభి, మండల అధ్యక్షులు సురేష్ నాయుడు,యువ నాయకులు సతీష్ నాయుడు,రాకేష్ రెడ్డి సౌద్రి బసవరాజు, రామలింగ, కురువ వీరేష్, గుండప్ప, జనసేన రామాంజినేయులు, బిజెపి చిన్న, రమేష్, పట్టణ అధ్యక్షులు డా. రాజానందు, ముకన్న, చిలకరి గిరి, నరసన్న, ఈరణ్ణ,. సన్నప్ప, మహాదేవ, లక్కే గోవిందు, లింగేష్ గొట్టయ్య మాధవరెడ్డి, బసవరాజు, అల్లయ్య పాల్గొన్నారు.



నాయకులను సన్మానిస్తున్న దృశ్యం



రామలింగేశ్వర స్వామిని దర్శించుకున్న టిడిపి మంత్రాలయం ఇంచార్జ్ రాఘవేందర్ రెడ్డి




అన్నదాత సుఖీభవ పథకం గురించి రైతులకు అవగాహన కల్పిస్తున్న టిడిపి మంత్రాలయం ఇంచార్జ్ రాఘవేందర్ రెడ్డి



నినియాల గ్రామ సమీపంలో తిరుగుతున్న ఒంటరి ఏనుగు

## నినియాలలో ఒంటరి ఏనుగు హల్‌చల్!

**రామకుప్పం (తెలుగోడు), మార్చి 18 :**
మండల పరిధిలోని నినియాల అటవీ సమీప ప్రాంతంలో ఒంటరి ఏనుగు హల్ చల్ చేసింది. మంగళవారం రాత్రి 10 గంటల దాటాక అటవీ ప్రాంతంలో నుంచి రామకృష్ణప్ప కు చెందిన వరి, మురుగప్పకు చెందిన టమోటా పంటను తిన్నంత తిని తొక్కింది. అటవీ సిబ్బంది, స్థానికులు కలిసి టపాకాయలు, బాణాసంచా పేల్చిన ఫలితం లేకపోయింది. అక్కడే తిష్ట వేసుకుని గంటసేపు తర్వాత అటవీ ప్రాంతానికి వెళ్ళింది. రాత్రి సమయం కాగానే ఏదో ఒక గ్రామం వైపు వచ్చి స్థానిక ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తోంది. గతంలో చేపట్టిన, కందకాలు సోలార్ కంచెను మరమ్మతులు చేయాలని రైతుల కోరుతున్నారు.



రంజాన్ తోఫా అందిస్తున్న మనోహర్, తదితరులు

## ముస్లిం సోదరులకు రంజాన్ తోఫా పంపిణీ

**రామకుప్పం (తెలుగోడు), మార్చి 18 :**
ముస్లిం మైనార్టీ సోదరులకు రంజాన్ పర్వదినాన ఘనంగా పండగ జరుపుకోవాలని సీఎం చంద్రబాబు వ్యక్తిగత కార్యదర్శి మనోహర్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. బుధవారం టిడిపి పార్టీ కార్యాలయంలో నిత్యవసర వస్తువులను ముస్లిం నిరుపేదలకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం రంజాన్ మాసంలో ముస్లిం మైనార్టీలకు తమ వంతు సహాయంగా చక్కెర, నూనె, గోధుమపిండి, పప్పు తదితర నిత్యవసర వస్తువులను అందించడం సంతృప్తి నిచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మాజీ మండల అధ్యక్షుడు ఆంజనేయ రెడ్డి, రెస్కో వైస్ చైర్మన్ విశ్వనాథ్, నేతలు రామకృష్ణప్ప, గంట్ల రెడ్డి, రామలింగారెడ్డి, సలాం సాబ్, అనీఫ్ సబ్, అక్బర్ సాబ్, ముజాహిద్ తదితరులు పాల్గొన్నారు.

## కాపునాడు అగళి మండల అధ్యక్షుడిగా కే.జయప్ప నియామకం

**అగళి (తెలుగోడు), మార్చి 18 :**



కాపునాడు ఆగళి మండల అధ్యక్షునిగా కె. జయప్ప ను నియమిస్తూ కాపునాడు జిల్లా అధ్యక్షుడు ఇటికింటి మహేష్,కాపునాడు రాయలసీమ అధ్యక్షుడు పూల పాండురంగ ప్రకటించారు. ఈ సందర్భంగా కాపు రామాంజనేయులు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో బలిజలకు అధిక సీట్లకు కృషి చేస్తానని వారందరి గెలిపించుకుంటామని శ్రీకృష్ణదేవరాయల జయంతి ప్రభుత్వం నిర్వహించే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని పేద విద్యార్థుల చదువు కోసం ఆదుకుంటామని బలిజల అభివృద్ధికి నా వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. అగళి మండల అధ్యక్షుడు జయప్ప మాట్లాడుతూ నా ఎన్నికకు సహకరించిన బలిజ బాంధవులకు కృతజ్ఞతలు తెలిపారు.

# సేవాభావానికి మారుపేరు కె.సి. పుల్లయ్య కుటుంబం

### ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి..

**ప్రొద్దుటూరు (తెలుగోడు), మార్చి 18 :**
కె.సి. పుల్లయ్య, ఆయన కుమారులు సేవ చేసే స్వభావం కలవారని, సేవాభావానికి మారుపేరు కె.సి. పుల్లయ్య కుటుంబం అని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి కొనియాడారు. బుధవారం స్థానిక వైఎంఆర్ కాలనీలోని వాసవీ కాటన్ మర్చంట్స్ కళ్యాణ మండపంలో కె.సి. పుల్లయ్య 14వ సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ దాతల సహకారాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కె.సి. పుల్లయ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో యువత కోసం స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ద్వారా ఉపాధి శిక్షణ ఇవ్వడం ఆనందకరమన్నారు. కె.సి. పుల్లయ్య ఆశయాలని వారు కుటుంబ సభ్యులు కొనసాగించడం అభినందనీయ మన్నారు. ఫౌండేషన్ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. కాగా జీఎస్టీ కడప డివిజన్ జాయింట్ కమిషనర్ సుమతి మాట్లాడుతూ సమాజానికి




ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డిని సన్మానిస్తున్న కే సి పుల్లయ్య ఫౌండేషన్ సభ్యులు




స్కాలర్షిప్‌లు, సర్టిఫికెట్లు పొందిన వారితో నిర్వాహకులు

తిరిగి ఇవ్వాలనే లక్ష్యంతో కె సి పుల్లయ్య సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. ఆర్యవైశ్య సంక్షేమ మరియు అభివృద్ధి సంస్థ ఛైర్మన్ రాకేష్ మాట్లాడుతూ తనకు జన్మనిచ్చిన పట్టణానికి సేవ చేయటానికి కె సి పుల్లయ్య ఫౌండేషన్ ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయ మన్నారు. జడ్పీ సిఈఓ ఓబుళమ్మ మాట్లాడుతూ ఫౌండేషన్ ద్వారా ఎంతోమంది విద్యార్థులకు, యువతకు శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పించడం అభినందనీయ మన్నారు. కె సి పుల్లయ్య ఫౌండేషన్ నిర్వాహకులు అనిల్ కుమార్ మాట్లాడుతూ కె సి పుల్లయ్య ఫౌండేషన్ ద్వారా విద్యార్థులకు దాదాపు 300 మందికి స్కాలర్షిప్ లు పంపిణీ చేశామన్నారు. ఇంతవరకు తమ స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ద్వారా హెల్త్, ఐటీ విభాగాలలో శిక్షణ ఇచ్చామని, ప్రస్తుతం జూట్, బ్యూటీషియన్, మగ్గం వర్క్ ద్వారా శిక్షణ ఇస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో కెసి పుల్లయ్య ఫౌండేషన్ ఛైర్ పర్సన్ కె. కృష్ణవేణమ్మ, నిర్వాహకులు సుశీల్ కుమార్, నవీన్ కుమార్, సిఈఓ సుధా రాణి, డాక్టర్ వరుణ్ కుమార్ రెడ్డి, సాధు గోపాలకృష్ణ, జింకా సుబ్రహ్మణ్యం, మాజీ టిటిడి బోర్డు మెంబర్ మారుతీ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న పూల అంగడి, మార్కెట్

## పల్లెలు , పట్టణాలకు ఉగాది శోభ

**ముద్దనూరు (తెలుగోడు), మార్చి 18 :**
ముద్దనూరు మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు ఘనంగా ఉగాది పండుగను జరుపుకోవడానికి సన్నాహాలు చేస్తున్నారు. పాత బస్టాండ్ ఆవరణలో పండుగ సందర్భంగా పూల దుకాణాలు మామిడి ఆకుల దుకాణాలు సందడితో కళకళలాడుతున్నాయి. అయితే పంచాంగం ప్రకారం చైత్రశుద్ధ పాఢ్యం తిది మార్చి 18 రాత్రి నుండి ప్రారంభమైనప్పటికీ, సూర్యోదయం ఆధారంగా మార్చి 19న ఉగాది పండుగ చేసుకుంటున్నట్లు ప్రధానార్చకులు పేర్కొన్నారు.

## బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్ కల్పించాలి

**ధర్మవరం (తెలుగోడు), మార్చి 18 :**
కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు కావొస్తున్న బీసీలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలం అయిందని బీసీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు సాకేనరేష్ అన్నారు. బీసీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ధర్మవరంలో సత్యసాయి జిల్లా కార్యవర్గ సమావేశం స్థానిక పెన్షనర్స్ భవన్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి గా బీసీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు సాకేనరేష్ హాజరై మాట్లాడుతూ బీసీల రక్షణ చట్టం అమలు చేయలేదని, బీసీ కులాలకు ఫెడరేషన్లు ఏర్పాటు చేసి పవర్స్ లేని పదవులు ఇచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు .

### దివ్యాంగ శక్తి పథకం ప్రారంభం..
### మధ్యాహ్న భోజనం పథకం పరిశీలన..
### విద్యార్థులతో ముచ్చట్లు..
### రైతు కుటుంబాలతో ముఖాముఖి..
### బిజీబిజీగా ఎమ్మెల్యే కాలవ పర్యటన..

# కర్షకుల పాలిట మహర్షి చంద్రన్న

**డి హిరేహాల్/ రాయదుర్గం (తెలుగోడు), మార్చి 18 :**
కర్షకుల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న కూటమి ప్రభుత్వం పాలన రైతులకు కొండంత అండగా నిలుస్తోందని స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ కాలువ శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం కాలువ శ్రీనివాసులు పర్యటన బిజీబిజీగా సాగింది.. ముందుగా రాయదుర్గం పట్టణంలోని బస్టాండులో ఏర్పాటుచేసిన దివ్యాంగ శక్తి పథకం ప్రారంభించిన కాల్వ శ్రీనివాసులు దివ్యాంగుల సభ్యులతో కలిసి సర్కారు బస్సులో ప్రయాణం చేశారు. అలాగే దివంగులతో కలిసి భోజనం చేశారు. అనంతరం రాయదుర్గం పట్టణంలోని 21 వార్డు పై తోట ఏరియాలో ఉన్న భక్త కన్నప్ప మున్సిపల్ ప్రైమరీ పాఠశాలలో డొక్కా సీతమ్మ పథకం కింద కొనసాగుతున్న మధ్యాహ్నం భోజనం కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులతో ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు భోజనం చేశారు. అలాగే సాయంత్రం డి హీరేహాల్ మండలం



దివ్యాంగ సభ్యులతో కలిసి సర్కారు బస్సులో ప్రయాణం చేస్తున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

దొడగట్ట గ్రామంలో నిర్వహించిన అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ పథకం లబ్ధి పొందిన రైతుల కుటుంబాల గడపగడపకు వెళ్లి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే కాలు శ్రీనివాసులు మాట్లాడుతూ అన్నదాతలను ఆదుకోవడానికి చేపట్టిన సంక్షేమ పథకాలను పక్కాగా అమలు చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాలన నాయకత్వాన్ని ఆయన "మహర్షి" చంద్రన్నగా ఎమ్మెల్యే కాలువ శ్రీనివాసులు అభివర్ణించారు. ఇదివరలో దివ్యాంగులకు షరతులకు లోబడి సర్కార్ బస్సులో ప్రయాణం చేసేందుకు వీలు ఉండేదని, కూటమి ప్రభుత్వం దీనిని మరింతగా విస్తరించి దివ్యాంగులకు సర్కార్ బస్సులో రాష్ట్రమంతా ప్రయాణం చేయడానికి వీలు కల్పించిందని కాలువ అన్నారు. అంతేకాకుండా దివ్యాంగులకు ఆర్థిక సహాయం ఉపాధి అవకాశాల కల్పనపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని కాలువ స్పష్టం చేశారు. సమాజంలో ప్రతి వర్గానికి సమాన అవకాశాలు కల్పించడం కూటమి ప్రభుత్వం ధ్యేయమని ఆయన చెప్పారు. సర్కారు పాఠశాలలలో అమలవుతున్న మధ్యాహ్నం భోజనం పథకం అమలవుతున్న పనితీరును ఎప్పటికప్పుడు పాఠశాలలకు వెళ్లి తనిఖీలు నిర్వహిస్తూ విద్యార్థులకు అందుతున్న ఆహార నాణ్యత పారిశుద్ధ్య పరిస్థితులను పరిశీలిస్తున్నట్లు ఆయన తెలిపారు. పాఠశాలలో వంట చేస్తున్న వంటశాలల నిర్వహణలపై అధికారులకు సూచనలిస్తూ పిల్లలకు పోషక ఆహారం అందేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించినట్లు ఆయన తెలిపారు. అలాగే ప్రజలకు అమలవుతున్న సంక్షేమ పథకాలలో ఎలాంటి లోపాలు ఉండకూడదని ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించడం అధికారుల బాధ్యత అని ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు అన్నారు. కర్షకులు, దివ్యాంగులు, విద్యార్థులు అభివృద్దే కూటమి ప్రభుత్వం ప్రధాన లక్ష్యమని ఆయన అన్నారు. రైతులను ఆదుకోవడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన పీఎం కిసాన్ అన్నదాత సుఖీభవ పథకాలు పక్కాగా అమలవుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం పెట్టుబడి సహాయం చేసిన సొమ్మును అనవసర ఖర్చులు చేయకుండా జాగ్రత్తగా ప్రభుత్వ ఆర్థిక సహాయాన్ని వినియోగించుకోవాలని రైతు కుటుంబాలకు సూచించినట్లు ఆయన తెలిపారు.



రాయదుర్గంలో దివ్యాంగ శక్తి పథకం దివ్యాంగులకు ఉచిత ప్రయాణం బస్సు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలువ శ్రీనివాసులు

రైతుల పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించలేకపోయినా రైతు పండించిన పంటను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని రైతులకు భరోసా ఇచ్చినట్లు ఆయన తెలిపారు. కార్మికులు శ్రామికులు వివిధ వృత్తులకు చెందిన వర్గాల వారు చంద్రబాబును ఆదరిస్తే చంద్రబాబు మిమ్ములను ప్రేమిస్తూ అన్ని విధాలుగా ఆదుకుంటాడని కాల్వ శ్రీనివాసులు అన్నారు. జరగబోవు స్థానిక ఎన్నికలలో కూటమి ప్రభుత్వానికి మద్దతు ఇస్తే మరింత అభివృద్ధి చేసే అవకాశం ఉంటుందని కాల్వ శ్రీనివాసులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ నాగవల్లి వెంకటేశులు రాయదుర్గం పట్టణం టిడిపి అధ్యక్షులు బండి కృష్ణమూర్తి ,టంకశాల హనుమంతు, రాష్ట్ర కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ తాలూకా జనసేన అధ్యక్షులు కురుబ మంజునాథ్ డి హిరేహాల్ మండల కన్వీనర్ పాటిల్ మోహన్ రెడ్డి ఎంపీటీసీలు తలారి గంగాధర మొండి మల్లికార్జున శ్రీరామ రాములు దొడగట్ట రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, విద్యార్థులతో ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు మాటామంతి.
దొడగట్ట గ్రామంలో నిర్వహించిన అన్నదాత సుఖీభవ పథకం పనితీరుపై రైతులను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

# ఉగాది పచ్చడిలో చేదే ఎక్కువ..!

### ధరల భారంతో మసకబారిన పండుగ ఉత్సాహం ..
### ఖర్చుల పెరుగుదలతో సామాన్యులపై ఆర్థిక ఒత్తిడి..
### మార్కెట్‌లో రద్దీ..
### కొనుగోళ్లు మాత్రం అవసరానికే పరిమితం..

**బత్తలపల్లి (తెలుగోడు), మార్చి 18 :**
తెలుగు సంవత్సరాది ఉగాది పండుగ బత్తలపల్లి మండల కేంద్రంలో సందడి నెలకొన్నప్పటికీ, ఈసారి పండుగ ఉత్సాహం కంటే ధరల భారమే సామాన్యులను ఎక్కువగా వేధిస్తోంది. ఆరు రుచులతో జీవితం ప్రతిబింబించే ఉగాది పచ్చడిలో ఈసారి ధరల చేదు రుచే ఎక్కువైందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కరువు పరిస్థితులు ఒకవైపు, నిత్యావసరాల ధరల పెరుగుదల మరోవైపు కలిసి సామాన్యులపై తీవ్రమైన ఆర్థిక ఒత్తిడిని సృష్టిస్తున్నాయి. టెంకాయలు, మామిడి ఆకులు, పూలు వంటి పండుగకు అవసరమైన వస్తువుల ధరలు గతంతో పోలిస్తే రెట్టింపు కావడంతో పండుగ నిర్వహణ భారంగా మారింది. పిండివంటలకు కావాల్సిన సరుకుల ధరలు కూడా పెరగడంతో సాధారణ కుటుంబాలు ఖర్చుల విషయంలో వెనకడుగు



కొనుగోలుదారులు లేక వెలవెలబోతున్న వస్త్ర దుకాణం



కొనుగోలుదారులతో కిటికీటలాడుతున్న బత్తలపల్లి కూడలి

వేస్తున్నాయి. కొత్త బట్టలు కొనడం సంప్రదాయం అయినప్పటికీ, చేతిలో డబ్బుల లేమితో చాలా మంది వాటి జోలికి వెళ్లలేకపోతున్నారు. బట్టల దుకాణాల్లో ధరలు ఆకాశాన్నంటుతుండటంతో కొంతమంది అవసరమైన వాటికే పరిమితమవుతున్నారు. గతంలో పథకాల ద్వారా కొంత నగదు అందడంతో పండుగ ఖర్చులకు ఉపశమనం లభించేదని ప్రజలు చెబుతున్నారు. ఈసారి ఆ లోటు స్పష్టంగా కనిపించడంతో మార్కెట్‌లో కొనుగోలు శక్తి తగ్గినట్లు వ్యాపారులు అభిప్రాయపడుతున్నారు. అయినా సంప్రదాయాన్ని నిలబెట్టుకోవాలనే తపనతో ప్రజలు అప్పులు చేసి అయినా పండుగ జరుపుకునేందుకు ముందుకు వస్తున్నారు. బుధవారం మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలతో మార్కెట్ ప్రాంతాలు కిక్కిరిసిపోయాయి. దుకాణాలు, తోపుడు బండ్లు అన్నీ జనంతో నిండిపోయినప్పటికీ, కొనుగోళ్లు మాత్రం అవసరానికి మాత్రమే పరిమితమయ్యాయి.

నాలుగు రోడ్ల కూడళ్లలో సాయంత్రం జనసంచారం భారీగా పెరిగింది. పండుగ రద్దీతో దుకాణదారులు రోడ్లపైకి వచ్చి సరుకులు విక్రయించడంతో రవాణా కూడా ఇబ్బందికరంగా మారింది. ఈ నేపథ్యంలో ఉగాది పండుగ ఆనందం కన్నా ఆర్థిక భారం ఎక్కువైందని, పండుగలపై ప్రజల్లో విసుగు పెరుగుతోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే, ఈ తెలుగు సంవత్సరంలోనైనా అనుకూల వర్షాలు కురిసి రైతులు, ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని అందరూ ఆశిస్తున్నారు.


# మున్సిపల్ ప్రత్యేక అధికారిగా డీఆర్ఓ మధుసూదన్ రావు

### స్వాగతం పలికిన కమీషనర్ ప్రమీల..
### బాధ్యతలు చేపట్టిన మధుసూదన్ రావు..

**మదనపల్లె (తెలుగోడు), మార్చి 18 :**
మదనపల్లె మున్సిపల్ కౌన్సిల్‌కు సంబంధించిన ఐదేళ్ల పదవీకాలం బుధవారంతో ముగిసింది. 2021 మార్చి 18 నుండి 2026 మార్చి 17 సాయంకాలం వరకు కొనసాగి, నిర్ణీత గడువు నాటికి పూర్తయింది. ఈ నేపథ్యంలో, రాష్ట్రంలోని అన్ని మున్సిపల్ సంస్థలలో ఎన్నికైన ప్రజాప్రతినిధుల పదవీకాలం ముగిసిన దృష్ట్యా, పరిపాలనలో ఎటువంటి అంతరాయం కలగకుండా ఉండేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మున్సిపాలిటీలలో పరిపాలన బాధ్యతలను తాత్కాలికంగా ప్రత్యేక అధికారుల ద్వారా నిర్వహించనున్నది. ఈ క్రమంలో మదనపల్లె మున్సిపల్ ప్రత్యేక అధికారిగా ఇంచార్జ్ జిల్లా జాయింట్ కలెక్టర్, డీఆర్ఓ మధుసూదన్ రావు నియమితులు అయ్యారు. బుధవారం ఉదయం మదనపల్లి మున్సిపాలిటీ కార్యాలయంలో ఇన్చార్జి జిల్లా జాయింట్ కలెక్టర్ మధుసూదన్ రావ్ ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ జిల్లా జాయింట్ కలెక్టర్, మదనపల్లె మున్సిపాలిటీ



మదనపల్లె మున్సిపల్ ప్రత్యేక అధికారికి స్వాగతం పలుకుతున్న కమీషనర్ ప్రమీల



మదనపల్లె మున్సిపల్ ప్రత్యేక అధికారిగా బాధ్యతలు చేపట్టిన ఇన్‌చార్జ్ జాయింట్ కలెక్టర్ మధుసూదన రావు

ప్రత్యేక అధికారి మాట్లాడుతూ... మున్సిపాలిటీ పరిధిలో ప్రజలకు అందుతున్న సేవలను మరింత మెరుగు పరచడానికి కట్టుబడి ఉన్నామని తాగునీటి సరఫరా, పారిశుధ్యం, కాలువల శుభ్రత, చెత్త నిర్వహణ, వీధి దీపాల నిర్వహణ వంటి మౌలిక సేవలలో ఎటువంటి అంతరాయం లేకుండా కొనసాగించేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. అలాగే నగర అభివృద్ధికి సంబంధించిన పెండింగ్ పనులను వేగవంతం చేసి, ప్రజలకు మెరుగైన వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. అలాగే, ప్రభుత్వ పథకాల అమలు, అభివృద్ధి పనులు, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ వేగవంతంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు తమ సమస్యలను సంబంధిత అధికారులకు తెలియజేయాలని, వాటిని నిర్ణీత గడువులోపు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం మున్సిపల్ పరిపాలన పారదర్శకంగా, సమర్థవంతంగా కొనసాగుతుందని వెల్లడించారు. ఈ సందర్భంగా మదనపల్లి మున్సిపాలిటీ కార్యాలయంలో ఇన్చార్జి జిల్లా జాయింట్ కలెక్టర్ మధుసూదన్ రావ్ కు మదనపల్లి శాసనసభ్యులు షాజహాన్ భాష, మదనపల్లి మున్సిపల్ కమిషనర్ ప్రమీల అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ శాఖ సిబ్బంది, అధికారులు, అనధికారులు తదితరులు పాల్గొన్నారు.


పేద వృద్ధ మహిళలకు నిత్యావసరాలు పంపిణీ చేసిన దృశ్యం

# పేద వృద్ధ మహిళలకు నిత్యావసరాలు పంపిణీ

### ఉద్యోగ ఉపాధ్యాయ సామాజిక సేవా సంస్థ ..

**తాడిపత్రి (తెలుగోడు), మార్చి 18 :**
స్థానిక వివేకానంద పాఠశాలలో ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన సేవా కార్యక్రమం హృద్యంగా, ఆదర్శప్రాయంగా నిలిచింది. ఉగాది, రంజాన్ పండుగలను పురస్కరించుకొని ఉద్యోగ ఉపాధ్యాయ సామాజిక సేవా సంస్థ 40 మంది పేద వృద్ధ మహిళలకు ఒక్కొక్కరికి రూ. 1200 విలువ చేసే 20 రకాల నిత్యావసర సరుకులను అందజేశారు. మొత్తం రూ. 48,000 విలువైన ఈ సరుకుల పంపిణీ చేయడం ద్వారా పండుగల సంతోషాన్ని పంచిపెట్టడం జరిగింది. వృద్ధ మహిళలు ఉద్యోగ ఉపాధ్యాయ సామాజిక సేవా సంస్థకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, పండుగల సమయంలో ఈ సహాయం తమకు ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.
ఈ సందర్భంగా ఉద్యోగ ఉపాధ్యాయ సామాజిక సేవా సంస్థ వర్కింగ్ ప్రెసిడెంట్ నారబోయిన శంకర్, అధ్యక్షుడు రామాంజనేయులు మాట్లాడుతూ,ఈ కార్యక్రమం ద్వారా మత సామరస్యానికి ఒక మంచి సందేశం వెళ్లిందని, ఉగాది, రంజాన్ వంటి పండుగలను కలిసి జరుపుకోవడం ద్వారా సమాజంలో ప్రజల నడుమ స్నేహభావం, సహకారం మరింత బలపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సేవా సంస్థ భవిష్యత్తులో కూడా ఇలాంటి మరిన్ని సేవా కార్యక్రమాలను చేపట్టాలని నిర్ణయించిందన్నారు.
సమాజంలో ఉన్న ప్రతి ఒక్కరికీ పండుగ ఆనందం చేరాలని మా సేవా సంస్థ సంకల్పమని, ఉగాది, రంజాన్ పండుగలు మత సామరస్యానికి ప్రతీకలుగా నిలుస్తాయని, ఈ రెండు పండుగలను కలిపి పేదలకు సహాయం చేయడం జరిగిందని తెలిపారు. గౌరవాధ్యక్షుడు గురప్ప, ప్రధాన కార్యదర్శి రామేశ్వర్ రెడ్డి, కన్వీనర్ దోగురు శ్రీహరి మాట్లాడుతూ ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను పెంపొందించడమే కాకుండా,యువతలో సేవా భావాన్ని పెంచుతాయని పేర్కొన్నారు.
తమ సంస్థ తరపున ఇప్పటికే 40 కుటుంబాలకు నెలవారీగా భత్యాన్ని అందజేస్తున్నామని, భవిష్యత్తులో మరింత మందికి సహాయం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. సేవా సంస్థ సభ్యుల సహకారంతోనే ఇలాంటి కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈకార్యక్రమంలో ట్రెజరర్ శ్రీ రంగయ్య, ఉపాధ్యక్షులు కరుణాకర్, శ్రీనివాసులు, చంద్రశేఖర్, నాగభూషణరావు, సభ్యులు మహబూబ్ బాషా, సంజీవ రాయుడు తదితరులు పాల్గొన్నారు.

# భక్తుల పాలిట కొంగు బంగారం శ్రీ గిడ్డాంజనేయ స్వామి

### నేటి నుంచి వసంత నవరాత్రి ఉత్సవాలు ..

**పెద్దకడబూరు (తెలుగోడు), మార్చి 18 :**
కొలిచే భక్తుల పాలిట కొంగు బంగారంగా పెద్దకడబూరు మండలం తారాపురం గ్రామంలో వెలసిన శ్రీశ్రీశ్రీ గిడ్డాంజనేయ స్వామి వెలుగొందుతున్నారు. స్వస్తిశ్రీ పరాభవ నామ ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని అనగా నేటి నుంచి వసంత నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభం కానున్నాయని ఆలయ కార్యనిర్వహణ అధికారి సాయికుమార్ బుధవారం విలేకరులకు తెలిపారు. ఉత్సవాల ప్రారంభదినమైన గురువారం ఉదయం ఆలయ ప్రాంగణంలో యాగశాల మండపం వద్ద విశేష పూజా కార్యక్రమాలు భక్తిపూర్వకంగా



శ్రీ గిడ్డాంజనేయ స్వామి గాలి గోపురాన్ని విద్యుద్దీపాలతో అలంకరించిన దృశ్యం

నిర్వహించనున్నారు. గణపతి పూజతో ప్రారంభమై పుణ్యాహవాచనం, బుద్ధి గ్వరణం, కలశ స్థాపన, అంకురార్పణ వంటి శాస్త్రోక్త క్రతువులు జరుగుతాయి. అనంతరం అవాహిత దేవతల సూక్త పారాయణం, జపాలు, కుంకుమార్చన నిర్వహించి మహానీరాజనం సమర్పిస్తారు. తరువాత భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేస్తారు. సాయంత్రం స్వామివారి ప్రభవ ఉత్సవం ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. సాయంత్రం 5 గంటల నుంచి 6.30 గంటల వరకు స్వామివారి సన్నిధిలో భజన కార్యక్రమాలు, హరినామ సంకీర్తనలతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంలో మునిగిపోనుంది. ఉత్సవాల రెండవ రోజు అయిన శుక్రవారం ఉదయం ప్రభాత పూజలు, అభిషేకార్చనలు, మహానీరాజనం, తీర్థప్రసాద వినియోగం వంటి విశేష కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అదేరోజు సాయంత్రం 5 గంటలకు అశేష భక్తజన సమూహం మధ్య శ్రీ గిడ్డాంజనేయ స్వామి మహా రథోత్సవం కన్నుల పండువగా జరగనుంది. రథోత్సవ సమయంలో గ్రామ వీధులు భక్తుల నామస్మరణలతో మార్మోగి ఆధ్యాత్మికోత్సాహంతో కళకళలాడనున్నాయి. ఈ వసంత నవరాత్రి ఉత్సవాలు భక్తులకు ఆధ్యాత్మిక చైతన్యాన్ని ప్రసాదించడంతో పాటు గ్రామంలో భక్తి భావాన్ని మరింతగా పెంపొందించనున్నాయని ఆలయ నిర్వాహకులు తెలిపారు. స్వామివారిని దర్శించుకుంటే కోరికలు నెరవేరుతాయని విశ్వాసంతో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి మహా రథోత్సవాన్ని తిలకించి అనుగ్రహాన్ని పొందుతారు. భక్తుల రాకపోకలకు, ప్రసాదాల పంపిణీకి, శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

**ఆలయ చరిత్ర..**
ప్రాచీన చారిత్రక ప్రాధాన్యం, అపారమైన భక్తి విశ్వాసంతో ప్రసిద్ధి చెందిన శ్రీ గిడ్డాంజనేయ స్వామి ఆలయం భక్తుల ఆధ్యాత్మిక కేంద్రంగా వెలుగొందుతోంది. ఈ ఆలయ చరిత్ర శ్రీకృష్ణదేవరాయలు కాలానికి చెందినదిగా భావించబడుతోంది. ఆ సమయంలో మహా పండితుడు వ్యాసరాయలు వారి ఆధ్వర్యంలో స్వామివారి ప్రతిష్ఠ జరిగినట్లు స్థానిక పురాణాలు చెబుతున్నాయి.
వ్యాసరాయలవారు కసాపురం, మురిడి, బుడుములదొడ్డి, నేమకల్, తారాపురం ప్రాంతాల్లో ఒకేరోజు, ఒకే గడియలో ఐదు దేవస్థానాలను ప్రతిష్ఠించారని భక్తులు విశ్వసిస్తున్నారు. ఈ విశేషం ఆయన అవధూత స్వరూపాన్ని తెలియజేస్తుందని చెబుతున్నారు. శ్రీ గిడ్డాంజనేయ స్వామి భక్తుల కోర్కెలను తీర్చే దైవంగా పేరు గాంచారు. భూత, ప్రేతబాధలు తొలగిస్తారని, పిలిస్తే పలికే దేవుడని భక్తుల నమ్మకం. స్వామివారి సన్నిధిలోనే శ్రీ వెంకటేశ్వర స్వామి స్వయంభూగా వెలసి ఉండటం ఈ క్షేత్రానికి మరింత విశిష్టతను అందిస్తోంది. ఈ ఆలయంలో శ్రావణమాసం, కార్తీకమాసం, ఉగాది, మహాశివరాత్రి వంటి పర్వదినాలలో ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహిస్తారు. ముఖ్యంగా శ్రావణమాసం రెండవ శనివారం జరిగే “పరుగు పండుగ” సందర్భంగా అర్చకుల ద్వారా వెలువడే దైవవాణిని భక్తులు ఎంతో విశ్వసిస్తారు. తమ కోరికలు నెరవేరుతాయని భావించి వేలాదిగా తరలివస్తారు.
ఇక స్వామివారి భక్తుడైన శ్రీ తిక్కతాత స్వామి ఆలయం సమీపంలో ఉండటం విశేషం. భక్తులు ముందుగా తిక్కతాత స్వామిని దర్శించి, అనంతరం



శ్రీ గిడ్డాంజనేయ స్వామి మూల విరాట్

గిడ్డాంజనేయ స్వామిని దర్శించడం ఆనవాయితీగా కొనసాగుతోంది. శ్రీ గిడ్డాంజనేయ స్వామి ఆలయం భక్తులకు ఆశ్రయం, నమ్మకం, దైవానుగ్రహానికి ప్రతీకగా నిలుస్తోంది. ఇంతటి మహిమాన్వితులైన శ్రీ గిడ్డాంజనేయ స్వామి మహా రథోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో తరలి స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆలయ అధికార సాయికుమార్ పిలుపునిచ్చారు.


శ్రీ గిడ్డాంజనేయ స్వామి ఆలయ గోపురం, మహా రథం. శ్రీ గిడ్డాంజనేయ స్వామి ప్రభ


అగ్నిగుండం వద్ద విన్యాసాలు చేస్తున్న వీరాచార్యులు. పాతాళగంగ వద్ద భక్తజన సందోహం. పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

# వైభవంగా ప్రభోత్సవం


నంది వాహన సేవ ..
మహా సరస్వతి అలంకారం..

**శ్రీశైలం (తెలుగోడు), మార్చి 18 :**
శ్రీశైలం మహా క్షేత్రంలో ఉగాది మహోత్సవాల సందర్భముగా మూడవ రోజైన బుధవారం నాడు శ్రీస్వామి అమ్మవార్లకు ప్రత్యేకపూజలు జరిపించారు. స్వామివారి యాగశాలలో చండీశ్వరపూజ, మండపారాధనలు, లోక కల్యాణం కోసం జపానుష్ఠానాలు, రుద్రహోమం నిర్వహించారు. అమ్మవారి యాగశాలలో చండీహోమం జరిపించారు. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి విశేషకుంకుమార్చనలు, నవావరణార్చనలు జరిపించారు. సాయంత్రం 5.30 గంటలకు సాయంకాల పూజలు, జపానుష్ఠానములు జరిపించారు.

**ప్రభోత్సవం..**
ఉగాదిమహోత్సవాలలో భాగంగా సాయంకాలం 5.30 గంలకు శ్రీస్వామిఅమ్మవార్ల ప్రభోత్సవం నిర్వహించారు. భోత్సవంలో రథానికి చేసినట్లుగానే ప్రభోత్సవంలో కూడా ప్రభకు బంతి, చేమంతి, గులాబి, సుగంధాలు, కనకాంబరాలు మొదలైన 11 రకాల పుష్పాలతో పుష్పాలంకరణ చేశారు.

**నందివాహన సేవ..**
ఉగాది మహోత్సవాలలో నిర్వహించే వాహనసేవలలో భాగంగా బుధవారం సాయంకాలం శ్రీస్వామిఅమ్మవార్లకు నందివాహనసేవ జరిపించారు. ఈ సేవలో శ్రీస్వామి అమ్మవారి ఉత్సవమూర్తులను నందివాహనంపై వేంచేబు చేయించి ప్రత్యేక పూజాదికాలు నిర్వహించి, తరువాత గ్రామోత్సవం జరిపించారు. నందివాహనాధీశులైన శ్రీస్వామిఅమ్మవార్లను దర్శించడం వలన చేపట్టిన పనులలో విజయం లభిస్తుందని, భోగభాగ్యాలు కలుగుతాయని పురాణాలలో ఉంది.

**మహాసరస్వతి అలంకారం..**
ఉగాది మహోత్సవాలలో అలంకారాలలో భాగంగా బుధవారం సాయంకాలం అమ్మవారి ఉత్సవమూర్తిని మహాసరస్వతి స్వరూపంలో అలంకరించారు. చతుర్భుజాలు కలిగి ఉండి, వీణ, అక్షమాల పుస్తకాన్ని ధరించిన ఈ దేవిని




దర్శించడం వలన విద్యాప్రాప్తితో పాటు అభీష్టాలు సిద్ధిస్తాయని నానుడి. అదే విధంగా గ్రామోత్సవంలో నాదస్వరం, కోలాటం, చెక్కభజన, రాజభటులవేషాలు, కేరళ చండీమేళం, కొమ్ముకొయ్య నృత్యం, ముంభాయ్ డోల్ థేష్, విళక్కు, స్వాగత నృత్యం, వీరభద్రడోలు కుణిత, జాంజ్ పథక్ ( కర్ణాటక డోలు) కాళికా నృత్యం, జానపద పగటి వేషాలు, నందికోలు సేవ, గొరవనృత్యం, తప్పెటచిందు, బీరప్పడోలు, నందికోలసేవ, ఢమరుకం, చిడతలు, శంఖం, పిల్లనగ్రోవి, డోలు విన్యాసం తదితర కళారూపాలను గ్రామోత్సవంలో ఏర్పాటు చేయబడ్డాయి కళాకారుల విన్యాసాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి


**అగ్నిగుండ ప్రవేశం..**
బుధవారం రాత్రి 10 గంటలకు శివదీక్షా శిబిరాల వద్ద కన్నడ భక్తులచే అగ్నిగుండ ప్రవేశ కార్యక్రమం నిర్వహించారు. వీరాచార సంప్రదాయాన్ని అనుసరించి జరిపే ఈ కార్యక్రమానికి ఎంతో ప్రాముఖ్యం ఉంది. అగ్నిగుండ ప్రవేశానికి ముందు వీరాచార విన్యాసాలు సాంప్రదాయపద్ధంగా నిర్వహించారు. కర్నాటకకు చెందిన వీరశైవ భక్తులు వీరభద్రవచనాలను పఠిస్తూ, ప్రత్యేక వేషధారణలతో, వివిధ వాయిద్యాల నడుమ విన్యాసాలు చేయనున్నారు. వీరిని పురవంతులు అని పిలుస్తారు. ఈ విశేష కార్యక్రమాలలో కార్యనిర్వహణ అధికారి ఎం శ్రీనివాసరావు దంపతులు ఆలయ అర్చక వేద పండితులు అధికారులు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు




ప్రభోత్సవం నిర్వహిస్తున్న అధికారులు


ప్రభోత్సవంలో పాల్గొన్న భక్తకోటి



విన్యాసాలు చేస్తున్న కళాకారులు



# మార్చి 27న పెద్ది టీజర్ విడుదల

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ కథానాయకుడిగా, 'ఉప్పెన' ఫేమ్ బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ బడ్జెట్ చిత్రం 'పెద్ది'. గ్రామీణ నేపథ్యంలో సాగే స్పోర్ట్స్ డ్రామాగా రూపొందుతున్న ఈ సినిమాపై ఇప్పటికే ఇండస్ట్రీలో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఏప్రిల్ 30న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా ఈ సినిమా విడుదల కావడానికి సిద్ధమవుతోంది. అయితే, ఇంకా షూటింగ్ మాత్రం కంప్లీట్ కాలేదు. రిలీజ్‌కు మరో ఆరు వారాల సమయం మాత్రమే ఉంది. మరి సినిమా అనుకున్న సమయానికి విడుదల అవుతుందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే, రిలీజ్ డేట్ దగ్గర పడుతుండటం తో చిత్రబృందం షూటింగ్ పనుల్లో వేగాన్ని పెంచింది. తాజా సమాచారం ప్రకారం, సినిమా చిత్రీకరణ దాదాపు పూర్తయింది. కేవలం మరో పది రోజుల షూటింగ్ మాత్రమే మిగిలి ఉందట. ఈ చివరి షెడ్యూల్‌లో కొన్ని కీలకమైన సన్నివేశాలతో పాటు, స్పెషల్ సాంగ్‌ను చిత్రీకరించబోతున్నారు. ఇక్కడితో పెద్ది షూటింగ్ కంప్లీట్ అయిపోయినట్టే. ఇదే స్పీడ్‌లో మార్చి 27న రామ్ చరణ్ బర్త్ డే గిఫ్ట్‌గా పెద్ది టీజర్ రిలీజ్‌కు సన్నాహాలుచేస్తున్నారు మేకర్స్. అక్కడి నుంచి బ్యాక్ టు బ్యాక్ అప్డేట్స్‌తో ప్రమోషన్స్ స్పీడ్ పెంచనున్నారు. ఈ చిత్రానికి ఆస్కార్ విజేత ఏ.ఆర్. రెహమాన్ సంగీతం అందిస్తుండగా.. ఇప్పటికే రిలీజ్ అయిన పాటలు సెన్సేషనల్ చార్ట్ బస్టర్ అయ్యాయి. అలాగే.. స్పెషల్ సాంగ్ కోసం రెహమాన్ అదిరిపోయే మాస్ బీట్ ఇచ్చినట్టుగా తెలుస్తోంది. ఈ పాటలో చరణ్‌తో కలిసి స్టెప్పులు వేయడానికి ఇద్దరు స్టార్ హీరోయిన్లను రంగంలోకి దింపుతున్నాడట బుచ్చిబాబు. ఈ సినిమాలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా.. కన్నడ సూపర్ స్టార్ శివరాజ్‌కుమార్, జగపతిబాబు, దివ్యేందు శర్మ వంటి వారు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

# ఉస్తాద్ ప్రీ ఈవెంట్‌లో కుల ప్రస్తావన




. 'ఉస్తాద్ భగత్ సింగ్' ఈవెంట్‌లో తన స్పీచ్‌లో ఉపయోగించిన పదాలపై నటుడు, దర్శకుడు పార్తిబన్ క్షమాపణలు చెప్పారు. హరీశ్ శంకర్ దర్శకత్వంలో పవన్ కల్యాణ్ హీరోగా తెరకెక్కిన ఈ చిత్రం 19న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో ఇటీవల ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో విలన్‌గా నటించిన పార్తిబన్ ఆ ఈవెంట్‌లో మాట్లాడిన స్పీచ్‌పై విమర్శలు వచ్చాయి. తనను తాను వేదికపై పరిచయం చేసుకుంటూ కులం పేరును ప్రస్తావించారు. అలా మాట్లాడినందుకు క్షమాపణలు చెబుతూ తాజాగా పోస్ట్ పెట్టారు. నేను తప్పు చేస్తే వెంటనే సరిదిద్దుకునే వ్యక్తిని. నిజం చెబుతున్నాను.. ఉద్దేశపూర్వకంగా అలా మాట్లాడలేదు. నేను కులవ్యవస్థను తప్పుపడుతూ ఎన్నో సినిమాలు చేశాను. అలాంటి నేను ఉద్దేశపూర్వకంగా ఎందుకు మాట్లాడతాను. అనుకోకుండా తప్పు జరిగింది. స్పీచ్ మధ్యలో నోరు జారాను. ఇన్నేళ్ల నా అనుభవంలో ఇలా కులం పేరు ప్రస్తావించడం ఇదే మొదటిసారి. మరోసారి ఇలా జరగకుండా జాగ్రత్త పడతాను' అని పార్తిబన్ తన పోస్ట్‌లో రాసుకొచ్చారు.

# వసూళ్లు ఖాయం..ఎంతనేది చెప్పలేను




ఈ ఉగాది 'ఉస్తాద్ ఉగాది'గా మారనుందని దర్శకుడు హరీష్ శంకర్ అన్నారు. అగ్రహీరో నుంచి పూర్తిస్థాయి కమర్షియల్ సినిమా వచ్చి చాలా రోజులవుతోంది. ఈ చిత్రం అన్నివర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. మిగతా సినిమాలకు ఉన్న టికెట్ రేట్లు మన సినిమాకు తెలంగాణలో రాలేదు. అందుకే ఇది ఎంత వసూళ్లు చేస్తుంది అని నేను చెప్పలేను. రూపాయి ఎక్కువ చేస్తుందా.. తక్కువ చేస్తుందా అని చెప్పలేను. కానీ, ఒక విషయం మాత్రం చెప్పగలను.. ఇది చూసిన తర్వాత 'ఇలాంటి సినిమా వచ్చి చాలా రోజులైంది' అని అందరూ అనుకుంటారు. పవన్ కల్యాణ్ నుంచి అభిమానులు ఏం కోరుకుంటారో అన్నీ ఇందులో ఉన్నాయి. నేను రికార్డులను మనసులో పెట్టుకోలేదు. ఎందుకంటే అవి విడుదల తేదీల ఆధారంగా ఉంటాయి. మనం ఒకటి తలిస్తే.. దైవం ఒకటి తలచినట్లు మార్చి 26న రావాల్సిన చిత్రం ఇప్పుడు విడుదలవుతోందని అన్నారు. సినిమా కలెక్షన్లు ఎప్పుడూ విడుదల తేదీ పైనే ఆధారపడి ఉంటాయి. సంక్రాంతికి వస్తే ఒకలా, సమ్మర్‌లో మరోలా.. ఏ సినిమా లేకపోతే ఇంకోలా.. ఇలా మారిపోతూ ఉంటాయి. అందుకే నేను రికార్డుల గురించి ఆలోచించట్లేదు. ఎక్కడా డబ్బు వృథా చేయకుండా ఈ సినిమాను తీశాను. ఎడిట్ చేయకముందు ఫస్ట్ హాఫ్ నిడివి 1.19 గంటలంతే. అందులో నుంచి ఫైల్‌లో కొంచెం తీసేశాం. సెకండ్ హాఫ్ కూడా అంతే తక్కువ నిడివి వచ్చింది. అందుకే నాకు ఎడిటింగ్ వర్క్ చాలా తక్కువ అయింది. పవన్ కల్యాణ్ వల్లే సినిమా ఇంత బాగా వచ్చింది. ఇక చివరి నిమిషంలో ఒక హీరోలాగా ఎంటర్ అయిన మా బావ తమన్‌కు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు. అడగ్గానే 10, 12 రోజుల్లో పూర్తి చేశాడు. థియేటర్ నుంచి బయటకు వచ్చేటప్పుడు ఫస్ట్ తన గురించే మాట్లాడుకుంటారు' అని హరీశ్ శంకర్ అన్నారు.

# థియేటర్ థ్రిల్ ఎంజాయ్ చేయండి - దర్శకుడు ఆదిత్యధర్ లేఖ



ధురంధర్ 2' కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న తెలుగు అభిమానులకు బ్యాడ్ న్యూస్. మార్చి 19న మూవీ విడుదల నేపథ్యంలో ఒకరోజు ముందుగానే ప్రీమియర్స్ ప్రదర్శిస్తున్న సంగతి తెలిసిందే. హిందీతో పాటు దక్షిణాది భాషల్లో ఈ మూవీని విడుదల చేస్తున్నారు. 'ధురంధర్: ది రివెంజ్' ప్రీమియర్‌ను తెలుగులో చూడాలని టికెట్ బుక్ చేసుకున్న అభిమానులకు నిరాశ ఎదురైంది. పలు మల్టీప్లెక్స్‌లు, సింగిల్ స్క్రీన్ థియేటర్లు ప్రీమియర్స్‌ను క్యాన్సిల్ చేశాయి. టికెట్లు బుక్ చేసుకున్న వారికి అమౌంట్ రిఫండ్ కూడా చేశాయి. సాంకేతిక సమస్యలతో తెలుగు వెర్షన్ ప్రీమియర్‌ను రద్దు చేసినట్లు తెలుస్తోంది. గురువారం యథాతథంగా హిందీతో పాటు, తెలుగులోనూ ప్రదర్శించనున్నట్లు సమాచారం. మరోవైపు దర్శకుడు ఆదిత్య ధర్ అభిమానులతో ఆసక్తికర విషయం పంచుకున్నారు. సినిమా చివరివరకూ చూడమని సూచించారు. ఎండ్ క్రెడిట్స్ పడేవరకూ థియేటర్‌లోనే ఉండాలన్నారు. ఈ పోస్ట్‌తో మరో అంశం తెర పైకి వచ్చింది. 'పార్ట్ 3' ఉంటుందంటూ సినీ ప్రియులు పోస్టులు పెడుతున్నారు. 'ప్రియమైన 'ధురంధర్' ఫ్యామిలీ.. సినిమాను మీరెంతో ప్రేమించారు. ప్రతి చిన్న అంశాన్నీ గమనించి, గుర్తించి మెచ్చుకున్నారు. మళ్లీ మళ్లీ చూసి, ఎవరూ గుర్తించలేరనుకున్న అంశాలను కూడా గుర్తించారు. ఈ అందమైన, అంచనా వేయలేని ప్రయాణంలో మా సినిమా మీది అయింది. ఆ తర్వాత దేశానిది.. ప్రపంచానిది కూడా అయింది. ఒక ఫిల్మ్‌మేకర్‌కు ఇదొక గొప్ప గిఫ్ట్. 'ధురంధర్: ది రివెంజ్'తో మిమ్మల్ని ఆశ్చర్యపరుస్తాం. మిమ్మల్ని భావోద్వేగానికి గురి చేస్తాం. సిద్ధంగా ఉండండి. స్నేహితులు, కుటుంబం ఇలా అందరితో కలిసి ప్రతి ట్విస్ట్, ఎమోషన్ థియేటర్‌లోనే అనుభూతి చెందండి. మొబైల్ స్క్రీన్‌లో దానిని ఆస్వాదించలేరు. నా విన్నపం ఏంటంటే, దయచేసి సినిమా చూసిన తర్వాత ట్విస్ట్‌లన్నీ చెప్పేయకండి. సినిమా చూసే వారికీ ఆ అనుభూతిని ఉంచండి. ఎండ్ క్రెడిట్ టైటిల్స్ పూర్తయ్యే వరకూ సీట్ల నుంచి లేచి వెళ్లిపోకండి' అని దర్శకుడు ఆదిత్య ధర్ లేఖలో పేర్కొన్నారు. భారతీయ సినీ పరిశ్రమలో సరికొత్త రికార్డులను లిఖించిన 'ధురంధర్' చిత్ర సృష్టికర్త ఆదిత్య ధర్ తాజాగా తన అభిమానులను ఉద్దేశించి ఒక బహిరంగ లేఖను విడుదల చేశారు.

# నాగ్ వందో సినిమాను రా కార్తీక్ మెప్పించేనా

టాలీవుడ్‌లో ఇటీవల చర్చనీయాంశంగా మారిన చిత్రం 'మేడ్ ఇన్ కొరియా'. ఈ సినిమా విడుదల తర్వాత ప్రేక్షకుల నుంచి మిక్స్‌డ్ రెస్పాన్స్ రావడంతో దర్శకుడు రా కార్తిక్ పేరు ఇండస్ట్రీలో ట్రెండింగ్‌గా మారింది. ముఖ్యంగా ఈ సినిమా ఫలితం తర్వాత కింగ్ నాగార్జున అభిమానుల్లో కొంత గందరగోళ పరిస్థితి కనిపిస్తోంది. కారణం ఏమిటంటే, నాగార్జున కెరీర్‌లో మైలురాయిగా నిలిచే 100వ సినిమాను రా కార్తిక్ తెరకెక్కించనున్నాడు. 'మేడ్ ఇన్ కొరియా' చిత్రంలో భావోద్వేగాలు ఉన్నప్పటికీ కథలోని ఎమోషన్స్‌ను బలంగా చూపించడంలో దర్శకుడు కొంత వెనుకబడ్డారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇదే సమయంలో రా కార్తిక్ ప్రస్తుతం నాగార్జునతో కలిసి పనిచేస్తుండటం ఆసక్తికరంగా మారింది. నాగార్జున కెరీర్‌లో 100వ సినిమా కావడంతో ఈ ప్రాజెక్ట్‌పై భారీ అంచనాలు ఉన్నాయి. యూనిక్ స్టోరీ టెల్లింగ్, థ్రిల్లింగ్ కథనాలతో తనదైన గుర్తింపు తెచ్చుకున్న రా కార్తిక్ ఈ సినిమాకు ఎలాంటి కథను సిద్ధం చేశారోనని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. కానీ 'మేడ్ ఇన్ కొరియా'కు వచ్చిన మిక్స్‌డ్ స్పందన తర్వాత అక్కినేని అభిమానుల్లో కొంత అనుమానం మొదలైంది. నాగార్జున వంటి సీనియర్ స్టార్‌కు 100వ సినిమా ఎంతో కీలకం కావడంతో కథ, దర్శకత్వం, నిర్మాణ విలువలు అన్నీ అత్యుత్తమంగా ఉండాలని అభిమానులు ఆశిస్తున్నారు.



Publisher and Owned by S.BABAJAN, Main Road, Nallamada, ANANTHAPUR, Andhrapradesh-515501. Printed At SUNDAY PRINTING PRESS, SVN Coliny, Gunturu... EDITOR- B.SHANKAR PRASAAD, PRGI No- APTEL/25/A2739 ..Cell No - 99634 96956, 73827 12780.